ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
జయశంకర్ భూపాలపల్లి
ములుగు
శుక్రవారం 6 డిసెంబరు 2024



తగ్గేదే లే



కాటారం, పెగడపల్లి రేంజ్‌ల సరిహద్దులోని అడవి

అడవిలో కొట్టిన పెద్దేగి చెట్టు

యథేచ్ఛగా కలపను తరలిస్తున్న స్మగ్లర్లు

- పుష్ప సినిమా తరహాలో దందా
- చెట్లను కోసి.. దుంగలుగా మార్చి ఆంధ్రాకు తరలిస్తున్న వైనం
- సెంట్రల్ బీట్ అడవుల నుంచి 600కు పైగా జిట్రేగి, పెద్దేగి చెట్లు మాయం
- స్మగ్లర్లకు సహకరిస్తున్న కొందరు అటవీ అధికారులు, బేస్‌క్యాంప్ సిబ్బంది
- పట్టించుకోని ఉన్నతాధికారులు

కాటారం/మహాముత్తారం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అరుదైన అటవీసంపద ధ్వంసమవుతోంది.. అచ్చం పుష్ప సినిమా మాదిరిగానే నాణ్యమైన విలువైన జిట్రేగి కలప పక్క రాష్ట్రానికి స్మగ్లర్లు తరలిస్తున్నారు. ఛామనచాయలో ఉండి అందమైన గృహోపకరణాల తయారీకి ఉపయోగపడే జిట్రేగి చెట్లు వందలాదిగా కాటారం రెవెన్యూ డివిజన్‌లోని పెగడపల్లి, పలిమెల, కాటారం రేంజ్‌ల సరిహద్దుల మధ్యలోని అడవుల నుంచి మాయమవుతున్నాయి..స్మగ్లర్లు అడవుల్లోనే బ్యాటరీ యంత్రాల ద్వారా జిట్రేగి, పెద్దేగి చెట్లను కూల్చి ముక్కలుగా కట్ చేసి దుంగలను వాహనాల ద్వారా ఆంధ్ర ప్రాంతానికి తరలిస్తున్నట్లు బహిరంగ ఆరోపణలున్నాయి. కాటారం మండలంలోని పలు గ్రామాలు, భూపాలపల్లి మండలం సుబ్బక్కపల్లి ద్వారా ఇతర ప్రాంతాలకు కలప స్మగ్లింగ్ అవుతున్నదని పలువురు ఆరోపిస్తున్నారు. టేకు కలపను మించి విలువైన జిట్రేగి చెట్లు వందలాదిగా మాయమై అడవులు బోసిపోతున్నా అటవీశాఖ నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటున్నదని విమర్శలు తలెత్తుతున్నాయి. కొందరు అధికారులు, బేస్ క్యాంప్ సిబ్బంది స్మగ్లర్లకు సహకారం అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ రేంజ్ పరిధిలో నుంచి జిట్రేగి చెట్లు నరికి కలపను తరలిస్తుండగా వేరే రేంజ్ అధికారులు, సిబ్బంది ఇటీవల జిట్రేగి కలపను పట్టుకోవడం గమనార్హం. రేంజ్ స్థాయి నుంచి మొదలుకుని సెక్షన్, బీట్ అధికారులు, బేస్ క్యాంప్ సిబ్బంది కొందరు కలప స్మగ్లింగ్‌కు అండదండలుగా ఉంటున్నారని అడవులు కోడై కూస్తున్నాయి. పెగడపల్లి రేంజ్ పరిధిలోని ఓ అధికారి కనుసన్నల్లోనే చెట్ల కోత, కలప లోడింగ్, వాహనాల్లో రవాణా జరుగుతున్నట్లు కొందరు అటవీ అధికారులు బహిరంగంగా నే చర్చించుకోవడం విశేషం, స్మగ్లర్లు విదిలించే డబ్బులకు ఆశపడి విలువైన అటవీసంపద ను కొందరు అటవీ అధికారులు వారి కనుసన్నల్లో అడవుల నుంచి బయటి ప్రాంతాలకు తరలించేలా స్థానికులను కాపలాదారులుగా ఏర్పాటు చేసి వారి సాయంతో బయటకు తరలిస్తున్నారు.

సుమారు రూ.2కోట్లకు పైగా విలువైన కలప తరలింపు

పెగడపల్లి, పలిమెల, కాటారం రేంజ్‌ల సరిహద్దుల మధ్యలో గల అడవుల నుంచి సుమారు రూ.2కోట్లకు పైగా విలువ చేసే జిట్రేగి కలప అక్రమంగా తరలిపోయినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. యత్నారం, నిమ్మగూడ సెక్షన్ల మధ్యలో అడవి జంతువులకు నీరందించేలా నిర్మించిన సోలార్ పీటీ (పర్క్యులేషన్ ట్యాంక్)సమీపంలో పెద్ద ఎత్తున జిట్రేగి చెట్లు బ్యాటరీ యంత్రాల(రంపం)సాయంతో నరికేసి దుంగలుగా మార్చి కలపను వాహనాల్లో తరలిస్తున్నారు. జిట్రేగి కలప క్యూబిక్ ఫీట్‌కు సుమారు రూ.3000-4000 వరకు పలుకుతున్నది. సుమారు 700చెట్ల నుంచి 5000క్యూబిక్ ఫీట్లకు పైగా రూ. 2కోట్ల కు పైగా విలువైన జిట్రేగి కలప స్మగ్లింగ్ అయినట్లు సమాచారం.

వందలాది జిట్రేగి, పెద్దేగి చెట్లు మాయం..!

కాటారం రేంజ్ సరిహద్దులను కలిసే పెగడపల్లి, పలిమెల రేంజ్‌ల్లోని పలు సెక్షన్ల పరిధి లో విలువైన జిట్రేగి, పెద్దేగి చెట్లు ఉన్నాయి. యత్నారం, లెంకలగడ్డ, నిమ్మగూడ, చింతకా ని సెక్షన్ల మధ్యలో గల సెంట్రల్ బీట్ నుంచి మొదలుకుని ములుగు జిల్లా మేడారం, పస్రా అడవుల వరకు వందలాదిగా పెద్ద పెద్ద జిట్రేగి చెట్లు ఉండేవి. గత 20 ఏళ్ల నుంచి జిట్రేగి చెట్లు నాణ్యమైన కలపను ఇచ్చే విధంగా పెరిగాయి. గత కొన్నేళ్లుగా టేకు చెట్లు మాయం కావడంతో కొందరు స్మగ్లర్ల కన్ను నాణ్యమైన జిట్రేగి కలపపై పడింది. ఆంధ్ర ప్రాంతంతో పాటు దక్షిణాది రాష్ట్రాలు, విదేశాల్లోనూ సంపన్నులు జిట్రేగి కలపను కొని గృహోపకరణాలు చేసుకుంటుండటం స్మగ్లర్లకు కలిసొచ్చింది. నిమ్మగూడ, యత్నారం అడవు ల్లోని జిట్రేగి కలప అత్యంత నాణ్యతతో విలువైనదిగా ఉండటంతో స్మగ్లర్లు కొందరు అటవీ అధికారులను లైన్‌లో పెట్టి తమకు సహకారమందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. తమకు సహకరించే అధికారులు, బేస్ క్యాంప్ సిబ్బందితో మాట్లాడుకుని ఇతర అధికారు లు ఇళ్లకు వెళ్లే వీకెండ్ డేస్(శని, ఆదివారాలు)ల్లో నిరాటంకంగా జిట్రేగి దుంగలను వాహనాల్లో రాత్రిపూట మహాముత్తారం, కాటారం మండలాల పరిధిలో పలు గ్రామాల మీదుగా భూపాలపల్లి మండలంలోని గ్రామాలకు తరలించి అక్కడి నుంచి ఆంధ్ర ప్రాంతానికి తరలిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇలా గత కొన్నినెలలుగా సుమారు600 జిట్రేగి, పెద్దేగి చెట్లు అడవుల నుంచి మాయమయ్యాయి.

అడవుల నుంచి పల్లెలకు.. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు..

మహాముత్తారం మండలం పరిధిలోని పలు సెక్షన్ల అడవుల్లో కొట్టిన జిట్రేగి చెట్లను యంత్రాల సాయంతో దుంగలుగా మార్చి మహాముత్తారం మండలం మాదారం, యత్నారం, ములుగుపల్లి, కాటారం మండలంలోని అంకుసాపూర్, కొత్తపల్లి, మేడిపల్లి ద్వారా భూపాలపల్లి మండలంలోని సుబ్బక్కపల్లి గ్రామ పరిధిలోకి తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అక్కడ రహస్యంగా నిల్వ చేసిన జిట్రేగి కలపను ఆంధ్రతో పాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలుస్తోంది. కాగా జిట్రేగి దుంగలు తరలిస్తున్న వాహనాలను ఇటీవల భూపాలపల్లి, పలిమెల రేంజ్ అధికారులు పట్టుకున్నారు. ఓ రేంజ్ నుంచి కలప తరలిస్తుండగా వేరే రేంజ్ అధికారులకు సమాచారం రాగా కలప వాహనాలను పట్టుకోవడంతో స్మగ్లర్లకు సహకరిస్తున్న అధికారుల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయింది. ఈ విషయమై డీఎఫ్‌వో నవీన్‌రెడ్డిని ఫోన్‌లో వివరణ కోసం యత్నించగా అందుబాటులోకి రాలేదు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ వైద్యఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఆస్పత్రుల్లో మౌళిక సదుపాయాలు, పీహెచ్‌సీల నిర్మాణ ప్రగతి, సిబ్బంది ఖాళీలపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు అందజేయాలన్నారు. ఆస్పత్రుల్లో ఖాళీలపై వివరాలు అందజేయాలని సూచించారు. 63 ఉప ఆరోగ్య కేంద్రాల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. 10 ప్రాంతాల్లో పిహెచ్‌సిల నిర్మాణానికి స్థల సమస్య ఉందని కాటారం సబ్‌కలెక్టర్, భూపాలపల్లి ఆర్డీఓకు నివేదిక అందించాలని డీఎంహెచ్‌ఓను ఆదేశించారు. చిటట్యాల, మహాదేవ్‌పూర్‌లల్లో బయోమెడికల్ వ్యర్థాలు వేసేందుకు షెడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మధుసూదన్, జీజీహెచ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైద్య అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూకంపంపై వదంతులను నమ్మొద్దు

మేడారం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తాడ్వాయి మండలం మేడారంలో బుధవారం ఉదయం వచ్చిన భూకంపంపై వస్తున్న వదంతులు నమ్మవద్దని, వాటిలో ఎలాంటి వాస్తవాలు లేవని మేడారం దేవాదాయ కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భూకంపం వల్ల గద్దెల ప్రాంగణంలో ఎలాంటి ధ్వంసం, నష్టం జరగలేదని చెప్పారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను ఖండిస్తున్నామని తెలిపారు. ప్రజలకు, భక్తులకు ఎలాంటి అపోహాలు లేవని రెండు, నాలుగు సెకండ్ల పాటు వచ్చిన భూకంపం వల్ల ఎలాంటి నష్టం వాటిల్లదని పేర్కొన్నారు.

అడవుల అభివృద్ధికి కృషి చేయాలి

డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి



ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి

కాటారం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అడవుల రక్షణకు విఘాతం కలుగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టి వాటి అభివృద్ధికి కృషి చేయాలని అటవీ అధికారులను భూపాలపల్లి డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి ఆదేశించారు. కాటారం రేంజ్‌లోని దామెరకుంట సెక్షన్ పరిధిలో గురువారం డీఎఫ్‌వో స్థానిక అటవీఅధికారులతో కలిసి పర్యటించారు. ప్లాంటేషన్లు, పీటీ(పర్కులేషన్ ట్యాంక్)లు, చెక్‌డ్యామ్‌లను పరిశీలించారు. క్యాలెండర్ ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్లాంటేషన్లలో మొక్కలు బాగా ఎదిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాటారం ఎఫ్‌ఆర్వో స్వాతి, డిప్యూటీ రేంజర్ సురేందర్, ఎఫ్‌బీవోలు రాజ్‌కుమార్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ములుగు కలెక్టర్ దివాకర



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రీడలు శారీరక వికాసంతో పాటు మానసిక వికాసానికి తోడ్పడి ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేస్తుందని జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాకేంద్రంలోని తంగేడు మైదానంలో జిల్లా క్రీడల అధికారి ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు జరిగిన క్రీడా పోటీలను ఆయన జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకుని జిల్లావ్యాప్తంగా ఈనెల 8వతేదీ వరకు క్రీడలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సీఎం కప్ పోటీలు గ్రామపంచాయతీల పరిధిలో ఈనెల 7, 8 తేదీల్లో, మండల పరిధిలో 10నుంచి 12వరకు జిల్లా పరిధిలో 16నుంచి 21వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని, పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. అనంతరం క్రికెట్, కబడ్డీ, హ్యాండ్‌బాల్ పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి తుల రవి, క్రికెట్ కోచ్ సందీప్, కబడ్డీ కోచ్ పి. జనార్ధన్, హ్యాండ్‌బాల్ కోచ్ కుమారస్వామి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్‌లో అధికారికి వినతిపత్రం అందజేస్తున్నఛి నాయకులు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంసీపీఐయూ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. అంతకుముందు ఏరియా ఆస్పత్రి నుంచి గాంధీ పార్కు మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గుండెబోయిన చంద్రయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదని, ఏం సాధించారని ప్రజాపాలన పేరుతో విజయోత్సవాలు నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు రైతు భరోసా ఇవ్వకపోవడం మోసం చేసినట్లు కాదా అన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కార్యాలయంలో అధికారికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జి.సదయ్య, రాస రాజన్న, సంగని రాజన్న, జంగిలి సుధాకర్, కామ రవి, మల్లయ్య, శ్రీనాథ్, ఇమ్మడి ప్రవీణ్, కుమారస్వామి, చెవుల సమ్మయ్య, సాంబయ్య పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకం ఆర్టీసీకి ఓ వరం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

కాకతీయఖని, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణాన్ని అందిస్తుందని, మహాలక్ష్మి పథకం ఆర్టీసీకి ఓ వరమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం ప్రజా పాలన, ప్రజా విజయో త్సవ కార్యక్రమం భూపాలపల్లి ఆర్టీసీ డీఎం దీప ఆధ్వర్యంలో బస్టాండ్‌లో నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలక ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్నప్పటి నుంచి ఇప్పటివరకు ఆర్టీసీకి రూ. 42.68 కోట్లు చెల్లించామన్నారు. మార్చి నెల లోపు రాష్ట్ర వ్యాప్తంగా మరో వెయ్యి నూతన బస్సులను తీసుకువస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాలకు అన్ని వేళల బస్సు సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిని అన్ని హామీలన వందకు వంద శాతం అమలు చేస్తామని అన్నారు. ఇప్పటికే మహాలక్ష్మి పథకం, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతులక రూ. 2లక్షల రుణ మాఫీ వంటి పథకాలను అమలు పరిచామన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను త్వరలోనే అందిస్తామన్నారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి మార్చి నుంచి సన్న బియ్యం అందేలా చూస్తామన్నారు. రాబోయే నాలుగేండ్లలో రోజుకు 18 గంటలు పనిచేస్తూ అవినీతికి తావులేకుండా ప్రజా శ్రేయస్సు కోసం పాటుపడుతామన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది జీఆర్ రెడ్డి, సందీప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, రాజేందర్, సాంబమూర్తి, అనిల్, రవీందర్, విజయ్, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

అత్తమామ తిట్టారని అల్లుడి ఆత్మహత్య



రాజ్‌కుమార్ (ఫైల్)

మొగుళ్లపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అత్తమామ అసభ్యకరంగా తిట్టడంతో అల్లుడు మనస్తాపంతో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం రాత్రి భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలకేంద్రంలో జరిగింది. స్థానిక ఎస్సై అశోక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మొగుళ్లపల్లికి చెందిన రావిశెట్టి రాజ్‌కుమార్(26) అనే యువకుడికి గత ఏడాదిన్నర క్రితం మండలంలోని పోతుగల్లు గ్రామానికిచెందిన కొంతం సదయ్య -రాజేశ్వరిల కుమార్తె రమ్యను ఇచ్చి వివాహం చేశారు. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రాజ్‌కుమార్ దాంపత్య జీవితంలో పాప జన్మించింది. దీంతో నాలుగురోజుల క్రితం రాజ్‌కుమార్ అత్తగారింట్లో తన బిడ్డకు పురుడు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజ్‌కుమార్ హాజరుకాగా అత్తమామ అకారణంగా అసభ్యకరంగా తిట్టడంతో మనస్తాపానికి గురయ్యాడు. దీంతో మొగుళ్లపల్లికి వచ్చి ఓ ఫర్టిలైజర్ షాపులో పురుగులమందు కొనుక్కున్నాడు. ఆ షాపు నుంచి నేరుగా నూతన గ్రామపంచాయతీ కార్యాలయం వెనుకకు వెళ్లి పురుగులమందు తాగి అపస్మారకస్థితిలోకి వెళ్లాడు. అటునుంచి పొలాల వద్దకు వెళ్తున్న రైతులు గమనించి చూసేసరికి అప్పటికే రాజ్‌కుమార్ మృతి చెంది ఉన్నాడు. మృతుడి తండ్రి మూగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

రాష్ట్ర శ్రేయస్సు కోరుతూ పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మహదేవపూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన దినోత్సవాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర శ్రేయస్సును ఆకాంక్షిస్తూ గురువారం ప్రత్యేక పూజలు జరిపారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయంలో ఉప ప్రధాన అర్చకులు పనకంటి ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు వేద పండితులు స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. కాళేశ్వరాలయానికి అనుబంధ దేవాలయమైన శుభానందదేవి ఆలయంలో నూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్యాక్రమంలో సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది, కాళేశ్వరం గ్రామస్థులు పాల్గొన్నారు.

పొట్టకూటి కోసం

వెట్టిచాకిరీ!

- సమస్యలతో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులు
- పెరగని వేతనాలు, అమలు కాని పీఆర్‌సీ
- పోలీసులతో సమానంగా విధుల నిర్వహణ
- సంక్షేమ విషయంలో మాత్రం చిన్నచూపు
- అమలుకాని ఎక్స్ సర్వీస్‌మెన్ రిజర్వేషన్
- ఆవిర్భావ వేడుకలూ నిర్వహించలేని దైన్యం
- నేడు హోంగార్డుల దినోత్సవం

5

రేపు జిల్లాకు మంత్రుల రాక

- పలు సంక్షేమ పథకాల ప్రారంభం
- ప్రజా విజయోత్సవ సభకు హాజరు
- ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



సీఐ నరేష్‌కుమార్‌కు సూచనలు చేస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న జిల్లాలో నలుగురు రాష్ట్ర మంత్రులు పర్యటించనున్నారు. రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం భూపాలపల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి సంక్షేమ పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవ సభ నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో రూ.7 కోట్లతో ఆస్పత్రిపై మూడో అంతస్థు నిర్మాణానికి శంకుస్థాపన, రామప్ప క్వార్టర్స్ వద్ద నిర్మించిన ఆయుష్ ఆస్పత్రికి ప్రారంభోత్సవం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ట్రామాకేర్ సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్నారు. దీంతోపాటు రేగొండ మండలంలోని పాండవుల గుట్ట, నాపాక టెంపుల్, కోటగుళ్ల పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధిపై కలెక్టరేట్‌లో మంత్రులు సమీక్ష నిర్వహించనున్నట్లు సమాచారం. మంత్రుల పర్యటనపై అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు.

అంబేద్కర్ కూడలిని పరిశీలించిన ఎస్పీ

భూపాలపల్లి కృష్ణకాలనీ : భూపాలపల్లి జిల్లా కేంద్రానికి ఈ నెల 7న రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహా, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు రానున్నారు. ప్రజా పాలన ప్రజావిజయోత్సవ సభ అంబేద్కర్ కూడలీలో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగానే జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే గురువారం అంబేద్కర్ కూడలీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ స్టేజీ ఎక్కడ ఏర్పాటు చేయాలనే విషయంతో పాటు బందోబస్తు పరంగా చేపట్టే అంశాలపై సీఐ నరేష్‌కుమార్‌తో కలిసి చర్చించారు. సభ సజావుగా సాగేందుకు ఎలాంటి అవాంతరాలు లేకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఐకి పలు సలహాలు, సూచనలు చేశారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

ప్రజాపాలన అంటే అరెస్టులా?

- ప్రశ్నిస్తున్న శక్తులు, వ్యక్తుల గొంతు నొక్కుతున్న సర్కారు
- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో ప్రజాపాలన, ప్రజాస్వామ్యం అంటే అక్రమ అరెస్టులేనా అని శాసనమండలి సభ్యుడు (ఎమ్మెల్సీ) తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ప్రశ్నించారు. మహబూబాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడీలను బద్ధలు కొడుతానన్న సీఎం రేవంత్‌రెడ్డి తానే గడిని నిర్మించుకుని రాష్ట్రంలో నియంతృత్వ పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు.

ప్రశ్నించే శక్తు లు.. వ్యక్తుల గొంతులను నొక్కడంతో పాటు అక్రమకేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. సీఎం కుటుంబ సభ్యుల ఫార్మా కంపెనీల కోసం లగచర్లలో గిరిజనుల భూములను లాక్కోవాలని చూశారని, ప్రతిపక్ష బీఆర్ఎస్ పోరాటంతో వెనక్కితగ్గారని చెప్పారు.

ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు పోరాటం..

ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసేంతవరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ కోసం పోరాడిన బీఆర్ఎస్ నాయకులకు కేసులు, నిర్బంధాలు కొత్తమి కాదని చెప్పారు. తెలంగాణలో ఏ ఒక్క పథకం కూడ సక్రమంగా అమలు కాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేవలం 12 వేల ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని చెప్పారు. అరెస్టు చేసిన బీఆర్ఎస్ నేతలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మునిసిపల్ వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, కౌన్సిలర్ ఎడ్ల వేణు, నాయకులు బానోత్ రవికుమార్, మంగలంపల్లి కన్న, జెరిపోతుల వెంకన్న, తేళ్ల శ్రీను, పుచ్చకాయల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన

మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

గూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌తోనే ప్రజలకు సుస్థిరమైన పాలన అందుతుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. గోవిందాపురం, గూడూరులలో అంగన్వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించి చిన్నారులకు యూనిఫాం అందజేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతాశిశు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అనంతరం గూడూరులోని జాతీయ రహదారిలో సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభించారు. తహసీల్దార్ శ్వేత, సీడీపీవో నిలోఫర్ అజ్మీ, ఎంపీవో సత్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వాంకుడోతు కొమ్మాలు, మండల అధ్యక్షుడు చిట్టి వెంకటేశ్వర్లు, బోయినపల్లి సతీష్‌రావు, శ్రీపాల్‌రెడ్డి, చంటిస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

నెల్లికుదురు : పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. నెల్లికుదురు మండలకేంద్రంలోని రైతు వేదికలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతికి రైతు భరోసా అమలు చేసి, వారిని ఆదుకుంటామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందన్నారు. రబీలో ధాన్యానికి బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.రాజు, ఎంపీవో పద్మ, డీఈ చంద్రశేఖర్, ఏవో యాస్మిన్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.


విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మెడికోలకు భద్రతేదీ?

- భూపాలపల్లి మెడికల్ కళాశాల వద్ద ఆకతాయిల ఆగడాలు
- బుధవారం అర్ధరాత్రి హాస్టల్ ఎదుట వీరంగం
- మద్యం మత్తులో విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విద్యార్థినులు

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థినులకు భద్రత కరువైందనడానికి భూపాలపల్లి మెడికల్ కళాశాల వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన సంఘటనే నిదర్శనంగా నిలుస్తోంది. ఈ మెడికల్ కాలేజీ విద్యార్థులకు ప్రభుత్వం రామప్ప క్వార్టర్స్‌లో తాత్కాలిక హాస్టల్‌ను ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. ఈ హాస్టల్ వద్ద బుధవారం అర్ధరాత్రి మద్యం తాగిన కొందరు ఆకతాయిలు తమ వికృతచేష్టలతో విద్యార్థినులను ఇబ్బంది పెట్టారు. దీంతో ఆ రాత్రంతా విద్యార్థినులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. గురువారం ఆ హాస్టల్ విద్యార్థినులు జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించిన వివరాలివీ. మెడికల్ కళాశాల హాస్టల్‌లోని 51వ బ్లాక్‌కు ఎదురుగా ఉన్న రోడ్డుపై అర్ధరాత్రి సమయంలో కొందరు తాగుబోతులు వీరంగం సృష్టించారని, తమపైకి మద్యం బాటిళ్లు విసిరారని, అసభ్య పదజాలంతో దూషించారని రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో తాము పోలీసులకు సమాచారమిచ్చామని, అది తెలుసుకున్న ఆకతాయిలు అక్కడి నుంచి పరారయ్యారన్నారు. స్పందించిన కలెక్టర్ హాస్టల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారని, భద్రతలోపాలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం.

ఎస్పీతో మాట్లాడి హాస్టల్ వద్ద భద్రత ఏర్పాట్లు చేస్తానని కలెక్టర్ విద్యార్థులకు భరోసా ఇచ్చినట్లు తెలిసింది. హాస్టళ్ల వద్ద భద్రత సిబ్బంది సంఖ్యను పెంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించినట్లు సమాచారం. అయితే బుధవారం అర్ధరాత్రి ఆ హాస్టల్ వద్ద జరిగిన ఘటనకు ముందు బాయ్స్ హాస్టల్‌లో ఓ విద్యార్థి పుట్టిన రోజు పార్టీ జరిగిందని, ఆ పార్టీకి హాజరైన వారిలో కొందరు తప్పతాగి విద్యార్థినిల పట్ల అసభ్యంగా వేధించారని సమాచారం. ఇక ఈ హాస్టల్‌లో ఉన్న భద్రతా లోపాలు ఈఘటనలతో బహిర్గతమయ్యాయని, అర్ధరాత్రి సమయంలో బయటి నుంచి వ్యక్తులు హాస్టల్స్‌లోకి వస్తున్నా ఎవరు పట్టించుకోకపోవడమేంటన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారులు ఇప్పటికైనా స్పందించి హాస్టల్స్ వద్ద మెరుగైన భద్రతను కల్పించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈఘటన గురించి తెలుసుకున్న వారంతా మెడికల్ విద్యార్థినులకు భద్రత కరువైందన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.


రామప్ప కాలనీలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన హాస్టళ్లు

బైకులు, తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యం

- కొన్నేళ్లుగా దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా
- ముగ్గురి అరెస్ట్
- 20.05లక్షల సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే


దొంగల ముఠా అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జల్సాలకు అలవాటు పడిన ముగ్గురు యువకులు.. చోరీలు చేస్తున్నారు. రాత్రి బయట ఉన్న బైక్‌లు.. తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్‌గా చేసుకొని కొన్నేళ్లుగా చేతివాటాన్ని ప్రదర్శిస్తున్న వారికి కాటారం పోలీసులు కళ్లెం వేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేక రుల సమావేశంలో ఎస్పీ కిరణ్‌ఖరే వివరాలను వెల్లడించారు. నవంబరు 27న కాటారం మండలంలోని శంకరంపల్లి గ్రామంలో చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న ఇంట్లోకి చొరబడిన దుండగులు బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బాధితులు కాటారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా ఇన్నాళ్లు దొంగిలించిన సొత్తును విక్రయించేందుకు వెళ్తుండగా అప్పటికే సీసీ కెమెరాల ద్వారా నిందితులను పసిగట్టిన పోలీసులు కాటారం మండలం మద్దులపల్లి చెక్‌పోస్టు వద్ద అనుమానస్పదంగా ఉన్న ముగ్గురు నిందితులను పట్టుకున్నారు.

వీరిలో మంచిర్యాల జిల్లా గాంధీనగర్‌కు చెందిన తాకొండ స్వామి చరణ్ అలియాస్ మున్నా, అసిఫాబాద్ జిల్లా తిర్యానికి చెందిన కురాసేన ఈశ్వర్, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన పనేం రాజేష్‌లు ఉన్నారు. నిందితులు జల్సాల కోసం గతంలో మహారాష్ట్రలోని చంద్రాపూర్ దగ్గర రాజూరా గ్రామం, ఘనపురం మండలంలో చెప్పర్, కొయ్యూర్ గ్రామం, హనుమకొండ. సుబేదారి, మంథనిలోని గుంజపడుగు, పస్రా, కాటారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడి బంగారం, వెండి, ద్విచక్ర వాహనాలను దొంగిలించినట్లు అంగీకరించారు. దీంతో వారి వద్ద నుంచి 17.3 తులాల బంగారు ఆభరణాలు, 83 తులాల వెండి ఆభరణాలు, 6 బైక్‌లు, 1 ఎల్‌ఈడీ టీవీ, 1 సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకోగా.. వీటి విలువ మొత్తంగా రూ.20,05,800 ఉంటుందని ఎస్పీ వెల్లడించారు.

నేర ఛేదనలో సీసీ కెమెరాలు దోహదం చేస్తాయని, ప్రతీ ఒక్కరు ఇంటి పరిసరాల్లో, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ పిలుపునిచ్చారు. కాగా, ఈ కేసు ఛేదనలో సమర్థవంతంగా పని చేసిన డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ నాగార్జునరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్సైలు అభినవ్, మహేందర్, రాజ్‌కుమార్‌తో పాటు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే, పలువురు సిబ్బందికి నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారు.

పట్టపగలే రెండు ఇళ్లలో చోరీ

- బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరణ
- మానుకోట పట్టణంలో ఘటన

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని బెస్తబజార్, మల్లం బజార్‌లో పట్టపగలే రెండు ఇండ్లలో చోరీ జరిగి రూ.12500 నగదు, ఆరు తులాలవెండి, 750 గ్రాముల బంగారు అభరణాలు అపహరించుకుపోయారు. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. బెస్తబజారుకు చెందిన జంగిలి హరీష్ అదే కాలనీలో ఉంటున్న అత్తగారింట్లో జరిగే తన కుమార్తె 21 రోజుల వేడుకలకు వెళ్లాడు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి, ఇంట్లోని బీరువాలోని ఆరుతులాల వెండి, 750 గ్రాముల బంగారు అభరణాలతో పాటు రూ.6,500 నగదును అపహరించుకుపోయారు. ఇదే కాలనీలోని దుగ్గి పుల్లమ్మ ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో చోరీకి యత్నించారు. మల్లంబజారుకు చెందిన మహేందర్-స్వాతి దంపతులు ఇంటికి తాళం వేసి పని నిమిత్తం బయటకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడంతో ఆందోళన చెందిన వారు ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో దాచిన రూ.6 వేల నగదు, ఒక్కొక్క గ్రాము విలువైన లక్ష్మీదేవి బంగారు బిల్లలు అపహరించుకుపోయినట్లు చెప్పారు. బాధితులు డయల్ 100కు కాల్ చేయడంతో బ్లూకోర్ట్స్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని చోరీలు జరిగిన రెండు చోట్ల క్లూజ్ బృందాలతో వేలిముద్రలు సేకరించారు. అనంతరం టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.


చోరీ జరిగిన చోట వేలిముద్రలు సేకరిస్తున్న క్లూజ్ టీం

రాత్రివేళల్లో కానరాని పెట్రోలింగ్

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గత ఆరు నెలలుగా ఎక్కడో ఓ చోట దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. కొత్త బజారులో ఇద్దరు బ్లూకోర్ట్స్ సిబ్బంది ఉన్నప్పటికి రాత్రి వేళల్లో ఎక్కడా వారి పర్యవేక్షణ లేదు. పాతబజారులో ఇద్దరు బ్లూకోర్ట్స్ సిబ్బంది ఉన్నప్పటికి తూతూ మంత్రంగా గస్తీ కాస్తూ తిరుగుతున్నారు. పోలీసులు పెట్రోలింగ్ చేయడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు. దీంతో ఆయా కాలనీల్లో దొంగల బీభత్సం ఎక్కువగా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతి చెందిన లారీ డ్రైవర్ ఇర్ఫాన్

దంతాలపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం వరంగల్ జాతీయ రహదారిపై గల మండలంలోని బీరిశెట్టిగూడెం స్టేజీ వద్ద గురువారం ఆగి ఉన్న లారీని వెనక నుంచి వస్తున్న మరో లారీ అతివేగంగా ఢీకొనడంతో ఓ డ్రైవర్ మృతి చెందాడు. స్థానిక ఎస్సై రాజు కథనం ప్రకారం... హర్యానా నుంచి విజయవాడ వైపు వెళతున్న బాస్మతి బియ్యం లోడు లారీ అతివేగంగా వచ్చి రోడ్డు దిగి ఆగి ఉన్న మరో లారీని ఢీకొనడంతో విజయవాడ వైపు వెళ్లుతున్న బాస్మతి బియ్యం లారీలో నిద్రిస్తున్న మరో డ్రైవర్ ఎస్‌కె ఇర్ఫాన్ (23) తీవ్ర గాయాలపాలై అంబులెన్స్‌లో ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడు ఇర్ఫాన్ హర్యానా రాష్ట్రంలోని సింగార గ్రామానికి చెందినవాడు. ఈ ఘటనలో రెండు లారీలు ధ్వంసమయ్యాయి. మృతుడి సోదరుడు ఎస్‌కే జఫ్రూ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

గుండెపోటుతో శబరిమలైలో డోర్నకల్ వాసి మృతి


వీరన్న (ఫైల్)

డోర్నకల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పస్వామి దర్శనానికి కేరళ రాష్ట్రం శబరిమలై వెళ్లిన డోర్నకల్ మండలానికి చెందిన కుదుళ్ల వీరన్న (55) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు, తోటి అయ్యప్ప మాలధారులు తెలిపిన వివరాల ప్రకారం. వెన్నారం గ్రామానికి చెందిన వీరన్న అక్టోబరులో అయ్యప్పస్వామి మాలధరించాడు. ఈ నెల 2వ తేదీన వెన్నారంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన ఇరుముడి కార్యక్రమం అనంతరం తోటి మాలధారులతో కలిసి 3న ప్రత్యేక రైలులో ఖమ్మం నుంచి శబరిమలైకు తరలివెళ్లారు. గురువారం అక్కడ అయ్యప్ప దర్శనం కోసం వెళ్తుండగా గుండెపోటుకు గురైన వీరన్న కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి స్వాములు అతడికి సీపీఆర్ చేసి ఎమర్జెన్సీ మెడికల్ బృందానికి సమాచారం అందించారు. వారు అక్కడికి వచ్చి ఆయన్ను పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్టుగా నిర్ధారించారు.

దాంతో అదే గ్రామానికి చెందిన తోటిస్వాములు వీరన్న కుటుంబసభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించారు. అయ్యప్ప దర్శనానికి శబరిమలై వెళ్లిన వీరన్న మృతి చెందడంతో వెన్నారంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వీరన్నకు తల్లి, భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరన్న మృతదేహాన్ని శబరిమలై నుంచి డోర్నకల్‌కు అంబులెన్స్ ద్వారా తీసుకొస్తున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

లక్ష్మీ పంప్‌హౌస్ విద్యుత్ బిల్లు బకాయి రూ.546.01కోట్లు


లక్ష్మీ పంప్‌హౌస్

మహదేవపూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టులోని లక్ష్మీ పంప్‌హౌస్ విద్యుత్ బిల్లులు రూ. కోట్లలో పెండింగ్ ఉంటోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం 2019లో జూన్ 21 నుంచి లక్ష్మీ పంప్‌హౌస్‌లో మోటార్లు నడిపి ఎత్తిపోతలను ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు భారీగా కరెంట్ బిల్లులు ఉండిపోయాయి. కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి(లక్ష్మీ) పంప్‌హౌస్ కరెంటు బిల్లులు విద్యుత్ సంస్థకు భారీగా బకాయి పడింది. కాళేశ్వరం ప్రాజెక్టు 2019 జూన్ 21న ప్రారంభించగా ఇప్పటివరకు రూ.కోట్ల మేర బిల్లులు బకాయి పడ్డాయి. కన్నెపల్లి పంప్‌హౌస్ ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు సుమారుగా 163 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. దీంతో భారీగా కరెంటు బిల్లు వచ్చింది. ఇందులో రూ 319.91 కోట్ల మేర బిల్లు చెల్లింపు చేయగా.. మరో రూ.546.01 కోట్ల బిల్లులు విద్యుత్ సంస్థకు చెల్లించాల్సి ఉంది.

భూతల్లిని కాపాడుకోవడం అందరి బాధ్యత

మహబూబాబాద్ డీఏవో విజయనిర్మల



మహబూబాబాద్ రైతువేదికలో మాట్లాడుతున్న విజయనిర్మల

మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భూ తల్లిని కాపాడుకోవ డం ప్రతీ ఒక్కరి బాధ్యత అని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల అన్నారు. మహబూబాబాద్‌లోని రైతు వేదికలో గురువారం ప్రపంచ నేల దినోత్సవాన్ని వ్యవసాయాధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు సుస్థిరమైన, సారవంతమైన నేలను అందించడానికి తీసుకోవాల్సిన చర్యలు సహజ, సూక్ష్మజీవుల సంరక్షణ తీసుకోవాలని చెప్పారు. చౌడు నేలల పునరుద్ధరణకు పచ్చిరొట్ట, జీలుగ, జనుము, పిల్లిపెసరలాంటి పంటలను వాడుకోవాలనిసూచించారు. మహబూబాబాద్ డివిజన్ ఏడీఏ అజ్మీర శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి ఎస్.తిరుపతిరెడ్డి, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో..

మల్యాలలోని జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానంలో కూడా ప్రపంచ మృతిక దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా ఉద్యానపరిశోధన స్థానం అధిపతి నాగరాజు మాట్లాడుతూ నేలల్లో సారవంతాన్ని కాపాడుకోవాలని చెప్పారు. నేలను కాపాడుకుంటేనే భవిష్యత్‌లో ఆహారం అందించగలమని చెప్పారు. నేలను కాపాడుకోవడం అందరి బాధ్యత అని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరిశోధన స్థానం ఉద్యోగులతో పాటు రైతులు పాల్గొన్నారు.

గురుకులం మెస్ కాంట్రాక్టర్‌కు మెమో


ఇనుగుర్తి గురుకులంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఇనుగుర్తి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేం ద్రంలోని బాలికల గురుకులంలో గురువారం జోనల్ అధికారి స్వరూపారాణి, జిల్లా క్వాలిటీ చెక్ అధికారి శంకర్, మండల ప్రత్యేకాధికారి కృష్ణవేణి తనిఖీలు నిర్వహించారు. ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించని మెస్ కాంట్రాక్టరుకు మెమోను జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

మావోయిస్టు జైసింగ్ మృతదేహం అప్పగింత

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 1న మండలంలోని చల్పాక అడవుల్లో గ్రేహౌండ్స్ పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు నేలకొరిగారు. మృతిచెందిన మావోయిస్టుల మృతదేహాలను మండల కేంద్రంలోని సామాజిక వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించగా ఈ నెల 2న ఏడుగురి మృతదేహాలకు శవపరీక్షలు నిర్వహించారు. శవపరీక్షల అనంతరం మృతదేహాలను వారి బంధువులకు పోలీసులు అప్పగించారు. ఈనెల 4వతేదీ వరకు ఐదుగురి మృతదేహాలను పోలీసులు బంధువులకు అప్పగించి స్వస్థలాలకు తరలించారు. కాగా, మావోయిస్టు దళసభ్యుడు జైసింగ్ స్వగ్రామం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఇంద్రావతి సుదూర ప్రాంతం కావడంతో ఆయన బంధువులు ఆలస్యంగా ఏటూరునాగారానికి చేరుకున్నారు. జైసింగ్ తల్లిదండ్రులు కొట్టెం సమ్మి-లక్ష్మణ్‌లు గురువారం ఏటూరునాగారం చేరుకోగా వారికి మంగపేట ఎస్సై సూరి ఆధ్వర్యంలో జైసింగ్ మృతదేహాన్ని అప్పజెప్పి అంబులెన్స్ ద్వారా స్వగ్రామానికి తరలించారు.

నేడు మల్లయ్య మృతదేహం..

ఈనెల 1న మండలంలోని చల్పాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఏడుగురి మృతదేహాలకు ఈనెల 2న కేఎంసీ ఫోరెన్సిక్ వైద్య బృందం సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి మృతుల బంధువులకు అప్పగించనుండగా ఈనెల 4 వరకు ఐదు మృతదేహాలను వారి బంధువులకు పోలీసులు అందజేసి వారి స్వస్థలాలకు తరలించారు. కాగా, మావోయిస్టు దళసభ్యుడు జైసింగ్ మృతదేహాన్ని పోలీసులు గురువారం ఆయన బంధువులకు అప్పగించారు. ఏటూరునాగారం-మహదేవ్‌పూర్ డివిజనల్ కార్యదర్శి ఈగోలాపు మల్లయ్య అలియాస్ మధు భార్య మీనా పోలీసులు విషం ఇచ్చి బూటకపు ఎన్‌కౌంటర్‌కు పాల్పడి తన భర్తను చిత్రహింసలు పెట్టారని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నెల 3న పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపి గురువారానికి వాయిదా వేసింది. గురువారం హైకోర్టులో పిటిషనర్ తరపు న్యాయవాది దశరథం వాదనలు వినిపించారు. బంధువులకు మృతదేహాన్ని చూపించకుండా పోలీసులు గోప్యత పాటించారని, మృతదేహంపై అనుమానాలు ఉన్నాయని, రీపోస్టుమార్టం నిర్వహించాలని వాదనలు కొనసాగాయి. ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది(పీపీ) కేఎంసీ ఫోరెన్సిక్ వైద్య బృందం ఆధ్వర్యంలోనే శవపరీక్షలు నిర్వహించామని, మరలా శవపరీక్షలు నిర్వహించడం అవసరంలేదని, బంధువులకు కూడా శవపరీక్షల అనంతరం మృతదేహాలను చూపించే అవకాశం కల్పించినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. హైకోర్టు మరలా పోస్టుమార్టం నిర్వహించడం అవసరంలేదని పిటిషనర్ తరఫు న్యాయవాది, ప్రభుత్వం తరఫున ఓ అధికారి సమక్షంలో బంధువులకు మృతదేహాన్ని పరిశీలించే అవకాశం కల్పించింది.

వీరి సమక్షంలో మృతదేహం పరిశీలన అనంతరం ప్రభుత్వం ఓ నివేదికను కోర్టుకు సమర్పించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈలోగా మృతదేహాన్ని దహన సంస్కారాల నిమిత్తం బంధువులు తీసుకువెళ్లవచ్చని హైకోర్టు స్పష్టం చేసింది. ఈమేరకు ఈగోలాపు మల్లయ్య అలియాస్ మధు భార్య కోర్టు తీర్పు అనంతరం ఏటూరునాగారంలోని సామాజిక వైద్యశాలకు చేరుకుంది. శుక్రవారం ఇరువర్గాల సమక్షంలో మృతదేహం పరిశీలన అనంతరం స్వగ్రామానికి తీసుకెళ్తామని భార్య మీనా స్పష్టం చేసింది.


జైసింగ్ మృతదేహం వద్ద అతడి బంధువు(మధ్యలో వ్యక్తి), మార్చురీ సిబ్బంది

'భద్రకాళి' గర్భంలో ఏముందో?

చారిత్రక చెరువు పూడికతీత వేళ ప్రజల్లో ఆసక్తికర చర్చ



- ప్రైవేటు కాంట్రాక్టర్‌కు పనుల అప్పగింత
- 900 ఏళ్ల నాటి సరస్సులో వారసత్వ సంపద దాగి ఉందనే భావన
- గుప్త నిధులు, విగ్రహాలు లభిస్తే పక్కదారి పట్టే అవకాశం
- చారిత్రక సంపదను కాపాడాలంటున్న ఓరుగల్లు వాసులు

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వందల ఏళ్ల చరిత్రకు చిరునామాగా ఓరుగల్లు నడిబొడ్డున ఉన్న భద్రకాళి చెరువు ఎన్నో చారిత్రక సంఘటనలకు సాక్ష్యం. తన గర్భంలో ఎన్నో రహస్యాలను అంతర్లీనంగా దాచుకున్న జలాశయం. ఒకప్పుడు 560 ఎకరాలు.. ఇప్పుడు 382 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో పేరుకుపోయిన మట్టిని వందల ఏళ్ల తరువాత వెలికితీసేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సుందరీకరణ కోసం ఇప్పటికే నీటిని మొత్తం బయటకు పంపి.. చెరువును ఖాళీ చేసిన యంత్రాంగం.. పూడికతీత పనులను ఓ ప్రైవేటు కాంట్రాక్టర్‌కు అప్పగించింది. అయితే వందల ఏళ్ల చరిత్ర ఉన్న భద్రకాళి చెరువు పూడికతీతతో భూగర్భంలో దాగిఉన్న రహస్యాలు బయటకొచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. కాకతీయుల కాలంలో నిధిని దాచారని, అలాగే నవాబుల కాలం నాటి దాడుల సమయంలో విగ్రహాలను ఈ చెరువులో పడేశారనే చర్చ ప్రజల్లో ఉంది. వందల ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువులో ఏ మూలన ఏ రహస్యం దాగి ఉందో.. తవ్వకాల్లో ఏ చోట ఏ చరిత్ర బయటకు వస్తుందో.. అనేది ఆసక్తికరంగా మారింది.

ఈ నేపథ్యంలో క్షణక్షణం.. పోలీసుల రక్షణ.. సీసీ కెమెరాల నిఘా.. పురావస్తుశాఖ అధికారుల పర్యవేక్షణ ఎంతో అవసరమని, అధికారులు పూర్తి అప్రమత్తతతో ఉండాల్సిన అవసరం ఉందని, వారి పర్యవేక్షణలోనే పూడిక తీత పనులు జరగాలని ఓరుగల్లు వాసులు డిమాండ్ చేస్తున్నారు.

చెరువు అడుగున చరిత్ర?

భద్రకాళి చెరువు సుందరీకణలో భాగంగా చేపట్టిన పూడికతీత పనులపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది. వందల ఏళ్ల కిందట నిర్మించిన చెరువు కావటంతో ఎన్నో జ్ఞాపకాలకు, గుప్త నిధులకు, రహస్యాలు దాగిఉండి ఉంటాయన్న చర్చ జరుగుతోంది. కాకతీయుల కాలాన్నే పరిశీలిస్తే వరంగల్ కోటను జయించేందుకు అనేక దాడులు జరిగాయి. క్రీ.శ. 1303, క్రీ.శ 1310లో ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీ, మాలిక్ నేతృత్వంలో జరిగిన దాడులను ప్రతాపరుద్రుడు తిప్పి కొట్టారు. క్రీ.శ. 1321లో గియాజ్ ఉద్ దిన్ తుగ్లక్ ఉలుగ్ ఖాన్ నేతృత్వంలోని సైన్యం వరంగల్ కోటపై దాడికి దిగింది. ఇలా నాలుగైదు యుద్ధాలు, దాడులు వరంగల్‌పై జరిగాయి. ఒకప్పుడు భద్రకాళి చెరువు ప్రాంతం మొత్తంగా అడవిగా ఉండేదని, ఈ ప్రాంతంలో నీటి సౌలభ్యం ఉండటంతో ఇక్కడే ఎక్కువ మంది సేద తీరేవారని చెబుతుంటారు. దాడుల సమయంలో గానీ, ఇతర సందర్భంలో భారీగా నిధులను, యుద్ధ సామగ్రిని చెరువుల్లోనే దాచి పెట్టేవారు. భద్రకాళి ఆలయం ఉండటంతో పాటు ఇతర చిన్న చిన్న ఆలయాలు కూడా ఉండేవని, పరాయి దేశస్థుల దాడుల్లో ఆ ఆలయాలను ధ్వంసం చేసి విగ్రహాలు, ఇతర సామగ్రిని భద్రకాళి చెరువులో పడేసి ఉండొచ్చుననే అనుమానాలున్నాయి. వీటికి తోడు భద్రకాళి చెరువు పక్కనే ఉన్న సిద్దుల గుట్ట, భైరవ గుట్టల్లో ప్రాచీన కాలం నుంచి మహర్షులు, మునులు, సాధువులు, యోగులు దీక్షలు, పూజలు చేసుకునేవారని, గుట్టల కింది భాగంలో కూడా విగ్రహారాధన జరిగేదని చెబుతుంటారు. గుట్టల సమీపంలో ఎలాంటి ఆధారాలు పెద్దగా లేకపోవవటంతో అవి చెరువు గర్భంలో కలిసిపోయి ఉండాయని భావిస్తున్నారు. కాకతీయుల పాలన ముగిసిన తరువాత భద్రకాళి ఆలయం పూజలకు దూరమైందనే అభిప్రాయాలున్నాయి. ఈ క్రమంలో అనేక దాడులు, విధ్వంసాలకు భద్రకాళి చెరువు సాక్షిగా నిలిచిందని, అప్పుడు అడవి ప్రాంతంలో ఉండంటంతో ఎన్నో గుప్తనిధులు, విగ్రహాలు, యుద్ధ సామగ్రి, రాజులు ధరించిన వస్త్రాలు, కత్తులు ఇలా అనేకం చెరువు గర్భంలో కలిసిపోయి ఉంటాయనే చర్చ జరుగుతోంది.

భద్రకాళి చెరువులో పూడికతీతకు శ్రీకారం

వరంగల్ నగర నడిబొడ్డున ఉన్న భద్రకాళి చెరువుకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. కాకతీయుల కాలంలో క్రీ.శ 1,199-1,323 వరకు కాకతీయుల పాలన సాగింది. క్రీ.శ 1,199-1,262 మధ్యకాలంలో గణపతి దేవుడు వరంగల్ కేంద్రంగా కాకతీయ సామ్రాజ్యాన్ని విస్తరించారు. ఆ కాలంలోనే భద్రకాళి ఆలయానికి సమీపంలో ఈ సరస్సును నిర్మించినట్టుగా భావిస్తారు. 900ఏళ్ల కిందటే ఈ చెరువు నిర్మాణ జరగడంతో పాటు నగరవాసులకు తాగునీటిని అందించేవారు. వందల ఏళ్ల చరిత్ర ఉన్న భద్రకాళిచెరువులో భారీ మోతాదులో మట్టి పేరుకుపోయింది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భద్రకాళి చెరువులో పూడిక తీసినట్టుగా అనవాళ్లు లేవని స్థానికులు పేర్కొంటున్నారు. భద్రకాళి బండ్‌ను ఇప్పటికే సుందరీకరణ చేయగా, చెరువులో పూడిక తీసి చెరువులో నీటి సామర్థ్యాన్ని పెంచాలని యంత్రాంగం ప్రణాళికను రూపొందించి అమలు చేస్తోంది. సుమారు 560 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు చుట్టూ భారీగా కబ్జాలకు గురైంది. దీంతో ప్రస్తుతం 382 ఎకరాల్లోనే భద్రకాళి చెరువు విస్తరించి ఉంది. 150 మిలియన్ క్యూబిక్ ఫీట్ల సామర్థ్యం ఉన్నా 132మిలియన్ క్యూబిక్ ఫీట్లకు నీరు చేరితే అలుగు పడుతుంది.

నవంబరు 8న చెరు వులో ఉన్న 130మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటిని బయటకు విడుదల చేసి చెరువును ఖాళీ చేశారు. పూడిక తీసే పనులను ప్రైవేట్ కాంట్రా క్టర్‌కు అప్పగించారు. పూడిక తీసి మరో 50మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటిని నిల్వ చేసేందుకు భద్రకాళి చెరువు సామర్థ్యాన్ని 200మిలియన్ క్యూబిక్ ఫీట్లకు పెంచాలని అధికారులు యోచిస్తున్నారు.

పర్యవేక్షణతోనే చరిత్రకు రక్షణ

ప్రభుత్వం భద్రకాళి చెరువును సుందరీకరించే పనులు చేప డుతోంది. ప్రస్తుతం చెరువులో ఉన్న 130మిలియన్ క్యూబిక్ అడుగుల నీటిని బయ టకు వదిలి ఖాళీ చేశారు. చెరువు విస్తరించి ఉన్న సుమారు 382 ఎకరాల్లో పూడికతీత పనులు చేపట్టనున్నారు. మట్టిని కూడా తరలిం చేందుకు నీటి పారుదల, రెవెన్యూ అధికారులు ప్రణాళిక రూపొందించారు. భద్రకాళి చెరు వులో పూడికతీతలో భాగంగా ఒక మీటర్ లోతు మట్టిని తీయ నున్నారు. ఒక మీటర్ మట్టి పూడిక తీసే సమయంలో చరిత్రాత్మక చెరువు కావటంతో ఏ మూల నుంచి ఏ రహస్యం బయటపడుతుందో.. ఏ ప్రాం తంలో.. ఏం చరిత్ర వెలుగులోకి వస్తుందోననే ఉత్కంఠ ప్రజల్లో కనిపిస్తోంది. రాత్రికి రాత్రి ఏదైనా విగ్రహమో.. చారిత్ర ఆనవాళ్లకు సంబంధించిన వస్తువో బయట పడి తే దాని భద్రతకు బాధ్యులు ఎవరనే చర్చ జరుగుతోంది. 2018 మే 4వ తేదీ న భద్రకాళి బండ్ సుందరీకరణ పనుల సందర్భంగా 1,300ఏళ్ల నాటి గణప తి పోలిన విగ్రహంతో పాటు శివలింగం, మరికొన్ని శిల్పాలు లభ్యమ య్యాయి. ఇవీ కాకతీయుల కాలం నాటికంటే పూర్వం విగ్రహాలుగా గుర్తిం చారు. అదే తరహాలో భద్రకాళి చెరువు మొత్తం పూడికతీస్తుం డటంతో చరిత్ర ఆనవాళ్లు బయట పడే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోంది. పూడిక తీత ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.

ఐఏఎస్ అధికారి నేతృత్వంలో పోలీసు అధికా రులు, పురావస్తుశాఖ అధికారులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులతో కలిపి ఓ ప్రత్యేక పర్యవేక్షణ కమిటీని నియమించాలని ఓరుగల్లు వాసులు కోరుతున్నారు. 24 గంటలూ మట్టి తీసివేతపై నిఘా ఉంచాలని, అవసరమైతే ఉదయం 6 గం టల నుంచి సాయంత్రం 6గంటల వరకే పూడికతీత చేపట్టాలని కోరు తున్నారు. పూడికతీతలో ఏ రహస్యమో.. నిధి దొరుకుతుందా? లేదా అనేది పక్కన పెడితే.. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా సుందరీకరణ పను లు పూర్తి చేసేందుకు కూడా ఈ కమిటీ ఉపయోగ పడుతుందని, ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

భద్రకాళి చెరువులో దీవి రహస్యమేంటో?

అద్భుత అందాలకు కేరాఫ్‌గా ఉన్న భద్రకాళి చెరువులోని ఓ ద్వీపంపై అందరి చూపు పడింది. చెరువు మధ్యలో సుమారు 2గుంటల విస్తీర్ణంలో ఈ ద్వీపం ఉంది. సహజ సిద్ధంగా ఏర్పడిన ద్వీపమా.. లేక పూర్వకాలంలో రాజులు లేదా ఇతరులెవ్వరైనా దీనిని నిర్మించారా? అనేది ఆసక్తికరంగా మారింది. పూర్వకాలంలో ఏదైనా గుప్తనిధులో.. లేక రాజకోట రహస్యం దాచి ఉంచినప్పుడు ఇలాంటి గుర్తులు ఏర్పాటు చేస్తారని చరిత్రకారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఓరుగల్లువాసులను మంత్రముగ్ధులను చేసే ఈ దీవి వెనుక ఉన్న రహస్యం ఏంటనే చర్చ జరుగుతోంది. ఇది సహజ సిద్ధంగా ఏర్పడిందే అయినా కొన్నేళ్ల తరువాత పూడికతీతకు ఏర్పాట్లు చేస్తుండటంతో ఈ దీవిపైనా ప్రజల్లో ఆసక్తి పెరుగుతోంది.

పొట్టకూటి కోసం వెట్టిచాకిరీ!



- సమస్యలతో విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డులు
- ఆవిర్భావ వేడుకలూ నిర్వహించలేని దైన్యం
- నేడు హోంగార్డుల దినోత్సవం

హనుమకొండ టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలను కాపాడటంతోపాటు నేరస్థులను పట్టుకునే విషయంలో పోలీసులకు దీటుగా విధులు నిర్వర్తించే హోంగార్డుల సంక్షేమాన్ని పాలకులు విస్మరిస్తున్నారు. ఉన్నతాధికారులు ఏ పనిని అప్పగించినా బాధ్యతతో నిర్వర్తించే హోంగార్డులను శాఖలోనే చిన్న చూపు చూస్తున్నారు. సమస్యలను పరిష్కరించాలని ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులతో పాటు పోలీసు ఉన్నతాధికారులను కలిసి విన్నవిస్తున్నప్పటికీ స్పందనలేదు. జీవితమంతా వెట్టిచాకిరీ చేయించుకుని చివరికి రిటైర్‌మెంట్ సమయంలోనూ బెనిఫిట్స్ ఇవ్వకుండా విధి నిర్వహణలో మరణిస్తే ఎలాంటి బెనిఫిట్స్ అందించకుండా, కారుణ్య నియామకాలను మధ్యలోనే ఆపి, సెలవులు ఇవ్వకుండా మానసిక వ్యధకు గురిచేస్తున్నారని హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 6వతేదీ శుక్రవారం 62వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వారి దీన పరిస్థితిపై కథనం.

అమలు కాని ముసాయిదా

బీఆర్ఎస్ హయాంలో హోంగార్డులకు రెండుసార్లు వేతనాలు పెంచి పీఆర్సీ ప్రకటించారు. నెలకు రూ.9000 ఉన్న వేతనాన్ని 12000కు పెంచారు. ఆ తర్వాత 2018లో రూ.18000కు పెంచారు. అనంతరం యేటా రూ.వెయ్యి పెంచాని జీవో 14, 15 తీసుకొచ్చారు. 2021లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కల్పించినట్టుగా పీఆర్సీ అమలు చేసి చివరిగా నెల వేతనం రూ.27,640కు పెంచారు. యూనిఫామ్ అలవెన్స్‌తో పాటు 100రోజులకు డైట్‌చార్జీ చెల్లించాలని జీవోలో పొందుపరిచారు. మిగతా విషయాలైన రిటైర్‌మెంట్, డెత్ బెనిఫిట్స్, కారుణ్యనియామకాలు, సెలవుల అంశాల్లో ఇదే పద్ధతిలో న్యాయం చేయాలని హోంగార్డులు పోరాటాలు చేయగా, ఐపీఎస్ రాజీవ్ త్రివేది ఆధ్వర్యంలో స్పెషల్ పోలీస్ అసిస్టెంట్ (ఎస్‌పీఏ) అనే ఒక ముసాయిదా రూపకల్పన చేశారు. కానీ అది ఇప్పటికీ అమలు కాలేదు. అ ముసాయిదాను అమలు చేయాలని హోంగార్డులు కోరుతున్నారు. గతంలో ప్రతిపక్ష హో దాలో ఉన్న రేవంత్‌రెడ్డి హోంగార్డుల హక్కుల కోసం రోడ్డెక్కి పోరాటం చేశారని, ఇప్పుడు సీఎంగా హోంగార్డుల కష్టాలను గుర్తించి రావాల్సిన బెనిఫిట్స్ అందజేయాలని హోంగార్డులు వేడుకుంటున్నారు.

ఆవిర్భావ వేడుకలకు దూరం

హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గతంలో అట్టహాసంగా నిర్వహించేవారు. హోంగార్డులతో పరేడ్ నిర్వహించి, వారి కుటుంబసభ్యులను ఆహ్వానించి, విధి నిర్వహణలో ప్రతిభచూపిన సిబ్బందికి ప్రోత్సాహకాలు అందజేసి భోజనాలు ఏర్పాటు చేసి పెద్ద పండుగలా నిర్వహించేవారు. కరోనా తర్వాత నుంచి హోంగార్డు ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణ మరిచిపోయారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సరిహద్దు జిల్లాల్లో ఇప్పటికే స్పోర్ట్స్ నిర్వహించి అట్టహాసంగా 62వ హోంగార్డు ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో వేడుకలకు దూరంగా ఉండటంపై హోంగార్డులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఈ విషయంపై వరంగల్ పోలీసు కమిషనరేట్ హోంగార్డ్స్ ఆర్ఐ చంద్రశేఖర్‌ను సంప్రదించగా ఐదారేళ్లుగా వేడుకలు నిర్వహించడం లేదని చెప్పారు. వేడుకలు నిర్వహణపై ఎలాంటి సమాచారం లేదన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి

ఉమ్మడి వరంల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 1300 మంది హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నారు. పోలీసు రిక్రూట్‌మెంట్‌లో ఎక్స్ సర్వీస్‌మెన్‌కు కల్పిస్తున్న రిజర్వేషన్‌లు అమలు చేయాలని హోంగార్డులు అభ్యర్థిస్తున్నారు. ప్రతీ నోటిఫికే షన్‌లో హోంగార్డుల కోటాలోని పోస్టులు అలాగే మిగిలి పోతున్నాయని, ఎవరూ ఎంపిక కావడం లేదని, ఈ అంశాన్ని ప్రభుత్వం గుర్తించి ఎక్స్‌మెన్స్ సర్వీసుకు ఉన్న ప్రత్యేక సడలింపులను హోంగార్డులకు కల్పించాలంటున్నారు.

అలాగే జీవో 14, 15లో పొందుపరిచినట్టు యూనిఫామ్ అలవెన్స్, డైట్ చార్జీలు ఇవ్వకుండా ఐదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేసి, హోం గార్డుల కుటుంబాలు చిన్నాభిన్నం కాకుండా ఆదుకోవాలని కోరుతున్నారు.

రోడ్లకు.. అటు.. ఇటు!

ఔరా!



ఏ గ్రామమైనా ఒక మండల పరిధిలో ఉండటం సహజం. కానీ, అందుకు భిన్నంగా ఉంది మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని సత్యనారాయణపురం, బోడగుట్ట తండా, ఉప్పలపాడు గ్రామాల పరిస్థితి. మండలకేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే సత్యనారాయణపురం గ్రామంలో మొత్తం 70 కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామం మధ్య నుంచి ప్రధాన రహదారి వెళ్లగా ఒక వైపు బయ్యారం మండల పరిధిలో.. మరో వైపు గార్ల మండల పరిధిలో ఉంది. బయ్యారం పరిధిలో 30 కుటుంబాలు, గార్ల పరిధిలో 40 కుటుంబాలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన పనుల విషయంలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక ఇదే జిల్లాలోని మరో రెండు గ్రామాల ప్రజల పరిస్థితి మరీ విచిత్రంగా ఉంది. చూడటానికి ఒకే గ్రామంగా కనిపిస్తున్నా నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాలు వేరు. ఒక బజారు మహబూబాబాద్ నియోజకవర్గం మహబూబాబాద్ మండలం బోడగుట్ట తండా పంచాయతీ పరిధిలోది కాగా, మరో బజారు ఇల్లెందు నియోజకవర్గం బయ్యారం మండలం ఉప్పలపాడు పంచాయతీ పరిధికి చెందింది. ఇక్కడ సుమారు 500 ఇళ్లు ఉండగా, బోడగుట్ట తండా పరిధిలోకి 200 ఇళ్లు, ఉప్పలపాడు పంచాయతీ లక్ష్మీనరసింహాపురం పరిధిలో 300ఇళ్లున్నాయి. ఇక్కడ ఓ సిమెంటు రోడ్డు సరిహద్దుగా ఉంది. రెండు గ్రామాలను కలిసిన ఆ గ్రామంలో ఎమ్మెల్యేలు సహా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు వేరు కావడంతో ప్రజలు అవస్థలు పడుతున్నట్లు తెలిసింది. ఎమ్మెల్యేలు, అధికారులు, ఇతరుల పర్యటనల సమయంలో అయోమయానికి గురవుతున్నట్టు చెబుతున్నారు.

- బయ్యారం (ఆంధ్రజ్యోతి)



కోడిగుడ్డు @ రూ.8

పెరిగిన ధర

ఒక్క ఎగ్ ట్రే రూ.200



చలి కారణంగా తగ్గిన ఉత్పత్తి

కేసముద్రం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పేద, మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో ఉండే పౌష్టికాహారం గుడ్డు. చలికాలం కారణంగా ఆ గుడ్డు ధర రోజురోజుకు పెరుగు తోంది. గత నెలలో ఇదే రోజున 30 గుడ్ల ట్రే ధర ధర రూ.170 ఉండగా ఇప్పుడా ధర రూ.200కి పెరిగింది. నెల రోజుల నుంచి హోల్‌సేల్‌లో ట్రే ధర రూ.160 నుంచి ప్రతీరోజు రూ.1 నుంచి రూ. 2 వరకు పెరుగుతోంది. దీంతో 15 రోజుల క్రితం వరకు రిటైల్‌లో ఒక్కో గుడ్డును రూ.6 విక్రయించగా.. ప్రస్తుతం రూ.7 నుంచి రూ. 8కు అమ్ముతున్నారు. అధిక ధరతో మధ్యాహ్న భోజనం, ఇతర ప్రభుత్వ హాస్టళ్లలో గుడ్డు వడ్డించడం నిర్వాహకులకు భారంగా మారుతోంది.

ఈ నేపథ్యంలోనే గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని కొన్ని దుకాణాల వారు ఒక్కో గుడ్డును రూ.8 నుంచి రూ. 9కు కూడా అమ్ముతున్నారు. సాధారణంగా చలికాలంలో గుడ్లు 20 నుంచి 30 రోజుల వరకు ఎలాంటి ఫ్రీజర్లు అవసరం లేకుండా నిల్వ ఉంటాయి. ప్రస్తుత వాతావరణం కోడిగుడ్లను ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు అను వుగా ఉంటుంది. మరోవైపు కోళ్లఫాంలలో చలి పెరగడంతో గుడ్ల ఉత్పత్తి 60శాతానికి పడిపోయింది.

ఉదాహరణకు 10 వేల కోళ్లు ఉన్న ఫాంలో గత నెలలో నిత్యం 9 వేల గుడ్ల ఉత్పత్తి కాగా చలి పెరిగిన నాటి నుంచి 6వేల నుంచి 6,500 వరకే గుడ్ల ఉత్పత్తి వస్తోందని కేసముద్రంలో కోళ్ల ఫాం నిర్వాహకుడు బొబ్బాల యాకూబ్ రెడ్డి తెలిపారు. ఫలితంగా మొత్తం మూడోంతుల్లో ఒకవంతు ఉత్పత్తి పడిపోయింది.

ఈ కారణాలతో ఏటా చలికాలం గుడ్ల ధరలు స్వల్పంగా పెరగడం సహజం. మరోవైపు డిసెంబరులో క్రిస్మస్, కొత్త సంవత్సర వేడుకల్లో దేశ వ్యాప్తంగా లక్షల క్వింటాళ్ల కేకులను తయారు చేస్తారు. ఈ కేకుల తయారీ కోసం కోడిగుడ్లను అధికంగా వినియోగిస్తుంటారు. దీంతో డిసెంబరు నెలలో కోడిగుడ్ల వినియోగం అధికంగా ఉండటం, ఉత్పత్తి తక్కువగా ఉండడంతో ధరలు పెరుగుతుంటాయని హోల్‌సేల్ విక్రయదారులు తెలిపారు.

సామాన్యులు కొనే పరిస్థితి లేదు

బాణాల రమ, గృహిణి, కేసముద్రం స్టేషన్



సామాన్యులకు అందుబాటులో ఉండే కోడిగుడ్డు ధర కూడా ఇంతలా పెరుగుతుందని ఊహించలేదు. ఇప్పుడు గుడ్లను కూడా సామాన్యులు కొనే పరిస్థితి లేదు. కొద్దిరోజుల క్రితం రూ.6కు ఒకటి ఉండగా ఇప్పుడు రూ.8 నుంచి రూ.8.50పైసలకు అమ్ముతున్నారు. అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినట్టే పేద, మధ్యతరగతి వర్గాలకు అవసరమయ్యే కోడిగుడ్డు రేటు పెరగడంతో కుటుంబాలపై మరింత భారం పడుతోంది.

క్యాన్సర్‌ను జయించి.. సామాజిక సేవలో ముందుండి

- సేవా గురువుగా గుర్తింపు తెచ్చుకున్న పింగిలి
- ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన పెంపునకూ కృషి

ఆదర్శం


'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతున్న పింగిలి శ్రీనివాస్

గూడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పిల్లల హృదయాంతరాల్లోకి వెళ్లగలిగే.. వారి ఆధ్యాత్మిక ప్రపంచాన్ని అర్థం చేసుకోలిగే.. కుటుంబాల స్థితిగతులను తెలుసుకుని ఆసరాగా నిలవగలిగే.. మనస్సున్న గురువులు కొందరే ఉంటారు. అలాంటి వారిలో పింగిలి శ్రీనివాస్ ఒకరు. విద్యార్థుల్లో భారతీయ విలువలను పెంపొందిస్తూ.. వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయడమే ధ్యేయంగా మార్చుకున్నారు గూడూరు మండల కేంద్రానికి చెందిన శ్రీనివాస్. ప్రమాదకరమైన క్యాన్సర్ మహమ్మారిని ఆత్మస్థైర్యంతో జయించి.. ముగ్గురు మిత్రులతో కలిసి మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాల నిర్వహిస్తున్న ఆయన వ్యాపార దృక్పథానికి దూరంగా, నైతిక విలువలకు దగ్గరగా ప్రయాణిస్తూ నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. గూడూరుకు చెందిన సరోజన-సత్తయ్య దంపతులకు జన్మించిన శ్రీనివాస్‌ది అతి సామాన్య కుటుంబం కావడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. భారతీయ విలువల రక్షణ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా 1990లో మానుకోటకు చెందిన అకారపు కె.కేశవరాజు గూడూరులో వివేకానంద పాఠశాలను ప్రారంభించగా.. ఆయన ఆశయాల పట్ల పింగిలి శ్రీనివాస్ ప్రభావితమయ్యారు. ఈ క్రమంలో కేశవరాజు 1995లో ఆర్ఎస్ఎస్‌లో ఫుల్ టైమర్‌గా వెళ్లిపోయిన తర్వాత ఆ పాఠశాల బాధ్యతలను తీసుకున్న శ్రీనివాస్ 1997లో తన స్నేహితులు పింగిలి సంజీవరెడ్డి, కాల్సాని శ్రీనివాస్‌రెడ్డి, నలమాస వెంకన్నతో కలిసి అరవింద పాఠశాలగా మార్చారు. కానీ 2000 సంవత్సరంలో పింగిలి శ్రీనివాస్ సర్కోమా క్యాన్సర్ బారిన పడ్డారు. బతకడం కష్టమని వైద్యులు చెప్పినా ఆత్మస్థైర్యాన్ని కోల్పోకుండా అనేక ప్రాంతాలు, ఆసుపత్రులకు వెళ్లి కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారంతో క్యాన్సర్‌ను జయించారు. అదే సమయంలో ప్రకృతితో కలిసి జీవించడం నేర్చుకున్న ఆయన తన చిన్నపాటి ఇంట్లో అనేక రకాల ఔషధ పండ్లు, కూరగాయల మొక్కలను పెంచారు. అంతేకాదు విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ 'సేవా గురు'గా పేరు తెచ్చుకున్నారు. ప్రతిభ ఉండి చదువుకోలేని స్థితిలో ఉన్న వారిని గుర్తించి చేరదీసి వారికి అండగా నిలిచి అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపారు. ఆయన వద్ద చదువుకున్న అనేక మంది నేడు దేశవిదేశాల్లో ఉన్నత రంగాల్లో రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు పూర్వ విద్యార్థులు, స్థానికుల సహకారంతో అనేక సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు.

అలాగే ప్రజల్లో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడానికి కూడా కృషి చేస్తున్న ఆయన గూడూరు మండల కేంద్రంలో కాకతీయుల నాటి సనాతన శివాలయాన్ని శిథిలావస్థ నుంచి అద్భుతంగా మలిచారు. నేడు ఆ ఆలయం భక్తుల రాకపోకలు, నిత్య పూజలతో వర్ధిల్లుతోంది. అంతేకాకుండా బతుకమ్మ, దసరా వేడుకలు, తదితర పండుగల సందర్భాల్లో ప్రజలను శ్రీనివాస్ ముందుండి నడిపిస్తున్నారు. ఇక ఆయన సతీమణి స్వరూప కూడా ఆయన అడుగు జాడల్లోనే నడుస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో తనవంతు పాత్ర పోషిస్తున్నారు.

సామాజిక విలువలతో కూడిన విద్యనందించాలి

పింగిలి శ్రీనివాస్, గూడూరు

శ్రమకు విలువ కట్టకలిగే విద్యా విధానాన్ని అందుబాటులోకి తీసుకురావాలి. మార్కులతో కూడిన విద్యావిధానం కాకుండా విలువలతో కూడిన విద్యనందించాలి. ప్రాచీన వారసత్వ సంపదకు సంబంధించిన కథనాలు, జీవిత చరిత్రలు బోధించాలి. సామాజిక నైతిక సాంస్కృతిక విలువలను విద్యార్థులకు అందించాలి. ఆచరణాత్మకంగా అమలయ్యే విద్యా విధానం ద్వారా విద్యార్థుల భవిష్యత్ ఉంటుంది. విద్య నేర్పిస్తే కాదు.. చూపిస్తే వస్తుంది.. మార్కులు ప్రామాణికం కాదు.. వారికి ఆదర్శాలు నేర్పించాలి.

వాజేడులో అదనపు కలెక్టర్ పర్యటన

వాజేడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా అడిషనల్ కలెక్టరు(రెవెన్యూ) మహేందర్ జీ గురువారం మండలంలో పర్యటించారు. మండలంలోని కొప్పుసూరు అటవీ ప్రాంతంలో గుండ్లవాగు ప్రాజెక్టు వరకు నిర్మించిన రోడ్డు నుంచి మురుమూరు వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో ఆయన మాట్లాడారు. రోడ్డు నిర్మాణంకు సంబంధించి పట్టా భూమి సుమారు 25 గుంటల స్థలం రోడ్డు నిర్మాణంలో పోతుంది. దీంతో ఆయన సదరు రైతులను కలిసి మాట్లాడారు. చెరుకూరులో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. చెరుకూరులోనే ఉన్న అంతర్రాష్ట్ర ధాన్యం కేంద్రాన్ని తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు.

కదలని ఖాకీలు!

- ఏళ్ల తరబడి ఒకే స్టేషన్లలో తిష్ట
- కీలక విధుల్లో ముఖ్య భూమిక
- జిల్లాలో సుమారు 43 కానిస్టేబుళ్లు?

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏళ్లుగా ఒకే పోలీస్‌స్టేషన్.. కీలకమైన విధులు.. ఏ అధికారి వచ్చినా వారికి వెన్నుదన్నుగా ఉండటం.. అసాంఘీక కార్యకపాల్లో ఆరితేరి చేతివాటం ప్రదర్శించడం, బదిలీయైనా పైరవీలతో ఒకే చోట తిష్ట వేసి ఠాణాను వదలట్లేదు కొంత మంది పీసీలు. భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా వివిధ ఠాణాల్లో పనిచేసే వారంతా ఉన్న చోటునే స్థావరంగా ఏర్పాటు చేసుకొన్నారు. అధికారులు వస్తూ వెళుతున్నా.. నిబంధనల ప్రకారం వారి విధుల నిర్వహణ గడువు ముగిసినా వారికి మాత్రం స్థాన చలనం కలగడం లేదు. దీంతో అన్నీ తామై చక్కబెడుతుండగా ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఏళ్లుగా ఒకే ఠాణాలో విధులు నిర్వరిస్తున్న పోలీసు కానిస్టేబుళ్లు ప్రస్తుతం వారే కీలకమైన విధుల్లో ఉంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఆయా ఠాణాల పరిధిలో పట్టు పెంచుకోవడంతో అధికారులను మచ్చిక చేసుకొని విధులు చేపడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఇలా ఒకే ఠాణాలో పనిచేసే వారిలో కొంత మంది రైటర్లుగా, మరికొంత మంది గన్‌మెన్‌లుగా, ఇంకొంత మంది క్రైం బీట్, బ్లూకోర్టు, పెట్రోకార్ ఇలా ఇతరత్రా విభాగాల్లో పని చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరికి ఇటీవల కాలంలోనే బదిలీ ఆర్డర్లు వచ్చినా కదలకుండా ఉంటున్నారనే విమర్శలు బాహాటంగానే వస్తున్నాయి.

ఒక్కో ఠాణాలో ముగ్గురి నుంచి నలుగురు..

జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్‌లలో లాంగ్ స్టాండెండ్‌గా పనిచేస్తున్న కానిస్టేబుళ్లు ముగ్గురి నుంచి నలుగురు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 43 మంది ఉన్నట్లు అధికారులు ఇటీవల గుర్తించినట్లు తెలిసింది. అయితే, వీరిలో చాలా మంది చేతివాటం ప్రదర్శించడంలో దిట్ట అనే ఆరోపణలు వస్తున్నాయి. ఏళ్ల తరబడి ఒకే ఠాణాలో పని చేయడమే వీరికి ప్రధాన ఆదాయంగా మారుతుందనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవున్నాయి. ఆయా ఠాణాల పోలీస్ అధికారులకు తెలిసి చేసేవి కొన్నైతే.. తెలియకుండా చేసేవి ఎన్నో ఉంటాయనేది బహిరంగ విమర్శలు వస్తున్నాయి. కాగా, ఇప్పటికే వీరంతా బదిలీయై వెళ్లిపోవాల్సి ఉండగా కుటుంబ అవసరాలు, పిల్లల చదవులనో ఆసరాగా చేసుకొని ఇక్కడే తిష్ట వేసుకునేలా పైరవీలు నడిపిస్తున్నారనే విమర్శలు మెండుగా వినిపిస్తున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మహాముత్తారం, డిసెంబరు5: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం సింగారం, ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామాల మధ్య గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో మూలమలుపు వద్ద ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు అతి వేగంతో ఢీకొనడంతో ములుగు జిల్లా కాలువపల్లి గ్రామానికి చెందిన పిల్లి కుమార స్వామి(38) తల రోడ్డుకు బలంగా తగలడంతో మృతి చెందాడు. మరో ద్విచక్ర వాహనం నడుపుతున్న భూపాలపల్లి జిల్లా పందిపంపుల గ్రామానికి చెందిన దామెర రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇరువురిని ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కుమార్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. రమేష్‌కు చికిత్స అందిస్తున్నారు. మహాముత్తారం పోలీసులు కేసు నమోదు చేసి శవానికి ములుగులో పోస్టుమార్టం నిర్వహించారు.

బాలల హక్కులపై అవగాహన

గోవిందరావుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్వాయి జడ్పీహెచ్‌ఎస్‌లో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధులశాఖ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన సదస్సు జరిగింది. ఈసందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ జ్యోతి పోక్సో చట్టం, బాల్య వివాహాల నిరోధకచట్టాలపై అవగాహన కల్పించారు. పాఠ శాల హెచ్‌ఎం చంద్రారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

రుణ మాఫీపై అన్నదాతల్లో ఆందోళన

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం నాలుగో విడత అందించే రుణమాఫీపై అన్నదాతల్లో అనిశ్చితి నెలకొంది. రెండు లక్షలలోపు రుణం ఉండి ఆధార్, రేషన్ ఇతర సమస్యలతో పెండింగ్‌లో ఉన్న రైతులు వాటిని క్లియర్ చేసుకుంటే నాలుగో విడతలో రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ అధికారికంగా ఆవివరాలను ఇప్పటికి వెల్లడించలేదు. బ్యాంకుల శాఖల వారీగా రుణ వివరాలతో కూడిన ఓ జాబితా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవ్వడంతో అదే ఫైనల్ లిస్టు అనుకొని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ శాఖ కార్యాలయంతో పాటు బ్యాంకుల చుట్టూ రుణ మాఫీ కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు. దీనిపై మహదేవపూర్ వ్యవసా యశాఖ అధికారి జ్యోతిని వివరణ కోరగా ప్రభుత్వం నుంచి నాలుగో విడత రుణమాఫీకి సంబంధించి అధికారికంగా ఎలాంటి వివరాలు రాలేదని తెలిపింది. కాని రైతులు వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలో లేదా రైతువేదికల్లో ఉన్న ఏఈవోలను సంప్రదించిన స్టేటస్ చెక్‌చేసి చెబుతారని తెలిపింది. ప్రభుత్వం నుంచి అధికారిక జాబిత వచ్చే వరకు రైతులు సంయమనం పాటించాలని కోరింది.

సేవారత్న అవార్డుకు ఎంపిక

మల్హర్, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి) : బహుజన సాహిత్య అకాడమి జాతీయ సేవారత్న అవార్డుకు మండలంలోని వల్లెంకుంట గ్రామానికి చెందిన నార బాలయ్య ఎంపికయ్యారు. ఈ మేరకు అవార్డు ఆహ్వాన పత్రాన్ని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ హైదరాబాద్‌లో అందించినట్లు బాలయ్య తెలిపారు. డిసెంబరు 15న దేశ రాజధాని ఢిల్లీలో జరిగే బహుజన సాహిత్య అకాడమీ 5వ నేషనల్ కాన్ఫరెన్స్ సందర్భంగా అందించనున్నట్లు తెలిపారు. బాలయ్య అవార్డుకు ఎంపిక కావడంపై పలువురు అభినందించారు.

నాగులమ్మ వద్ద భక్తుల సందడి

మల్హర్, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొయ్యూర్ నాగులమ్మ వద్ద గురువారం భక్తుల సందడి నెలకొంది. గురువారం ఉదయం నుంచే ఆలయానికి భక్తుల రాక మొదలైంది. బుధ, గురు వారాల్లో అమ్మవారికి మొక్కులు అప్పజెప్పడానికి భక్తులు తరలివస్తారని ఆలయ పూజారులు తెలిపారు. కుటుంబ సమేతంగా నాగులమ్మ ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబసమేతంగా వన భోజనాలు చేశారు.

గొత్తి కోయలకు పౌష్టికాహారంపై అవగాహన

కన్నాయిగూడెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వాయి గ్రామ పంచాయతీ పరిధిలోని మల్కపల్లి లో ఎంసీహెచ్ వైద్యుడు డాక్టర్ గిరి , నీతి ఆయోగ్ బ్లాక్ కో ఆర్డినేటర్ రవీష్ ఆధ్వర్యంలో గూడెం వాసులకు పౌష్టికాహారంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. పౌష్టికాహార లోపాలు, అంటువ్యాధులపై అవగాహన కల్పించి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని మందులు పంపిణీ చేశారు. ఈజీఎస్ ఏపీవో సురేష్ పాల్గొన్నారు.

ఆస్పత్రి, పాఠశాలల్లో పండ్ల పంపిణీ

గోవిందరావుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త తుమ్మల రామకృష్ణ పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ఆయన ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, వృద్ధులు, గ్రామపంచాయతీ సిబ్బందికి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సృజన్‌కుమార్, ఎంఈవో గొంది దివాకర్, పంచాయతీ కార్యదర్శి శంకర్, ప్రధానోపాధ్యాయులు కొర్ర రఘురాం, సోమారెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

మేడారం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారం గ్రామానికి చెందిన పులిమాదరి క్రాంతి(24) గురువారం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం లేవగానే ఇంట్లో ఉరివేసుకుని ఉన్న క్రాంతిని చూశామని తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించామని అన్నారు. కాంత్రి ఓ అమ్మాయిని ఇష్ట పడ్డాడని, అయితే ఆ అమ్మాయి తన ప్రేమను ఒప్పుకోకపోవడంతో ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం చేశారు. బంధువుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సమగ్ర శిక్షణ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఏటూరునాగారం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షణ ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని, తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని శిక్షణ ఉద్యోగులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో మండలంలోని సమగ్ర శిక్ష ఉద్యోగుల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ నెల 6, 7 తేదీలలో జరిగే సమ్మె నోటీసును ఎంఈవో కొయ్యడ మల్లయ్య శిక్షణ ఉద్యోగులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వారిని వెంటనే రెగ్యులరైజేషన్ చేయాలని, ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతం చేస్తామని ఉద్యోగులు హెచ్చరించారు. ప్రభుత్వం తమ డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఉద్యోగులు, ఏటూరునాగారం ఎంఆర్‌సీ సిబ్బంది, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

మ్యాచర్‌తో సంబంధం లేకుండా కాంటాలు నిర్వహించాలి

మల్హర్, డిసెంబర 5(ఆంధ్రజ్యోతి) : కురుస్తున్న ఆకాల వర్షాల వల్ల మ్యాచర్‌తో సంబంధం లేకుండ వరి ధాన్యం కాంటాలు త్వరగా నిర్వహించాలని కోరుతు కొయ్యూర్ కొనుగోలు కేంద్రంలో రైతులు గురువారం ఆందోళనకు దిగారు. కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం పోసి రోజులు గడుస్తున్న కాంటాలు కావడం లేదని రైతులు పేర్కొన్నారు. రైతులు కుంభం సమ్మిరెడ్డి, బాపురెడ్డి, వీరయ్య, రాజేంధర్, ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యులు కార్తీక్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్ట్ సరికాదు

మంగపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవరిస్తున్న అసమర్ధ పాలనపై ప్రశ్నించే గొంతుకలను అరెస్ట్ చేయడం నియంత పాలనకు నిదర్శనమని బీఆర్‌ఎస్ మండల కమిటీ సభ్యులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ములుగు నియోజక వర్గ సమన్వయకర్తలు తాటి కృష్ణ, వత్సావాయి శ్రీధర్‌వర్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శిలు కుడుముల లక్ష్మీనారాయణ, రాజుయాదవ్‌లు మాట్లాడారు. మంగపేట సహకార సంఘం చైర్మన్, వైస్ చైర్మన్లు తోట రమేష్, నరేందర్‌యాదవ్, డైరెక్టర్లు నర్సయ్యయాదవ్, లక్ష్మన్‌రావుగుప్తా తదితరులు పాల్గొన్నారు.

వక్తిపై గొడ్డలితో దాడి

మహదేవపూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన సుంకె మహేష్‌పై ఇద్దరు వ్యక్తులు గొడ్డలితో దాడికి పాల్పడ్డారు. మహదేవపూర్ ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి సుంకె మహేష్‌కు, ఇద్దరు వ్యక్తులకు భూమి విషయంలో తగాదా ఏర్పడింది. ఈ క్రమంలో అతడిపై ఇద్దరు వ్యక్తులు గొడ్డలితో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫెర్టిలైజర్ షాపుల తనిఖీ చేసిన ఏడీఏ

కన్నాయిగూడెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం నిషేదించిన మందులు, బయో మందులు అమ్మిన, ఎమ్మార్పి దరలకంటే ఎక్కువ అమ్మిన ఫర్టిలైజర్స్ షాపుల పై శాఖ పరమైన చర్యలు తప్పవని ఏటూరునాగారం ఏడీఏ జే అవినాష్ వర్మ అన్నారు. గురువారం ఆయన ఏఈఓ కళ్యాణితో కలిసి మండలంలోని ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీలు చేశారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా కరుణాకర్

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా బట్టు కార్ణాకర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా ఉమేష్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శిగా ఉమేష్ రెడ్డి ఎన్నికయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా యువజన కాంగ్రెస్ ఎన్నికలు జరుగగా 7వేట్లు సాధించి ఉమేష్ ఉమేష్ గెలుపొందారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

ములుగు జిల్లా కమిటీ ఎన్నిక

ములుగు : (ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో ములుగు జిల్లా అధ్యక్షుడిగా మహ్మద్ ఇస్సార్‌ఖాన్, నియోజకవర్గ అధ్యక్షుడిగా మారం సుమన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగ పేట మండలం రాజుపేటకు చెందిన ఇస్సార్‌ఖాన్, వెంకటాపూర్ మండలం రామాంజాపూర్‌కు చెందిన సుమన్‌రెడ్డిలు ఎన్నికల బరిలో నిలవగా పోటీ లేకపోవడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధిష్టానం ప్రకటించింది. గురువారం వారిద్దరు స్త్రీ, సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్కను హైదరాబాద్‌లో కలిశారు. మంత్రి అభినందించారు.

● భూపాలపల్లి కృష్ణకాలనీ(ఆంధ్రజ్యోతి) : యువజన కాంగ్రెస్ భూపాలపల్లి మండల అధ్యక్షుడిగా మొదలకరి శరత్‌పటేల్ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ ఎన్నికల్లో భూపాలపల్లి మండల అధ్యక్షుడిగా బరిలో నిలిచిన ఆయన 3036 ఓట్లతో గెలుపొందారు.

● కాటారం, (ఆంధ్రజ్యోతి):ఇటీవల జరిగిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో మంథని నియోజకవర్గ అధ్యక్షుడిగా గారెపల్లికి చెందిన చీమల సందీప్, మండల అధ్యక్షుడిగా ధన్వాడకు చెందిన చీటూరి మహేష్‌గౌడ్ ఎన్నికయ్యారు. ఆన్‌లైన్ ఎన్నికల్లో అత్యధిక ఓట్లు సాధించి ప్రస్తుతం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఉన్న సందీప్ నియోజకవర్గ అధ్యక్షుడిగా, మహేష్ మండల అధ్యక్షుడిగా విజయం సాధించారు.

● మహదేవపూర్ (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అన్నారం గ్రామానికి చెందిన పరుశమేని నగేష్ యాదవ్ గురువారం నియామమయ్యారు. ఈ సందర్భంగా ఆయన నియామకానికి కృషి చేసిన మంత్రి శ్రీధర్‌బాబుకు, ఆయన తమ్ముడు శ్రీనుబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

కోతుల నివారణకు చర్యలు తీసుకోవాలి

మహదేవపూర్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండల కేంద్రంలోని వివిధవార్డుల్లో , గ్రామాల్లో కోతులు విచ్చలవిడిగా స్వైర విహారం చేస్తూ పిల్లలు, వృద్ధులను సైతం భయభ్రాంతులకు గురి చేస్తూ తీవ్రంగా గాయపరుస్తున్నాయని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బెల్లంపల్లి సురేష్ మాదిగ తెలిపారు. ఈ మేరకు గురువారం మహదేవపూర్ మండల కేంద్రంలో మహదేవపూర్ రేంజ్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ధ్యయ్య, లింగాల సమ్మయ్య, నల్లబుగ సమ్మయ్య, మండల మాదిగ యువసేన మండల అధ్యక్షులు మంథని రవితేజ, మండల ప్రధాన కార్యదర్శి లింగాల నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ నిర్వహణపై సమావేశం

మహదేవపూర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సీఎం కప్ నిర్వహించేందుకు గాను మండల పరిషత్ కార్యాలయంలో గురవాఆరం ఎంపీడీవో కె.వెంకటేశ్వర్లు సమావేశం ఏర్పాటు చేశారు. మహదేవపూర్ మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఉత్సాహవంతులైన క్రీడాకారులు పాల్గొనేలా అథ్లెటిక్, ఫుడ్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో , యోగా వంటి క్రీడలలో క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు. ఈ నెల 7 నుంచి 8 వరకు గ్రామస్థాయిలో.. 10 నుండి 12 వరకు జిల్లా స్థాయిలో క్రీడలు జరుగుతాయని తెలిపారు. క్రీడాకారులనుంచి దరఖాస్తులు స్వీకరించి క్రీడాకారులు పాల్గొనేటట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఎంపీడీవో ఆదేశించారు. ఎంఈవో ప్రకాష్ బాబు, పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

కాటారం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):మండలంలోని ధన్వాడ, రేగులగూడెం, శంకరంపల్లి, గంగారం జీపీల పరిధిలో జీపీ ఎన్నికల కోసం ఏర్పాటు చేసే పోలింగ్ స్టేషన్లను గురువారం కాటారం ఎంపీడీవో అడ్డూరి బాబు, ఎంపీవో వీరస్వామి పరిశీలించారు. జీపీ పరిధిలో ఉన్న వార్డుల సంఖ్యకనుగుణంగా పోలింగ్‌స్టేషన్ల కోసం కేటాయించే గదులను పరిశీలించి, సౌకర్యాలపై ఆరా తీశారు. మండలవ్యాప్తంగా 24 గ్రామపంచాయతీల పరిధిలోని 210వార్డులకు గానూ పోలింగ్ స్టేషన్లు ఉంటాయని తెలిపారు. జీపీల కార్యదర్శులు ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

కాటారం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ(బాలుర) గురుకుల కళాశాలకు చెందిన హ్యాండ్ బాల్ అకాడమి క్రీడాకారులు ఆర్ చందర్, బీ నరేష్ అనే విద్యార్థులు ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యా రు. గత నెలలో హైదరాబాద్ జిల్లా తుక్కుగూడలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీల అండర్-19విభాగంలో చందర్, నరేష్‌లు అత్యంత ప్రతిభ కనబర్చి గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్‌ఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి రమేష్ తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి 17వరకు పంజాబ్ రాష్ట్రంలోని లూధియానాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో చందర్, నరేష్ పాల్గొంటారని ప్రిన్సిపాల్ లాల్ వెల్లడించారు. గురువారం గురుకులంలో జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

జీవ ఎరువులతో భూసారాన్ని రక్షించుకోవచ్చు

రేగొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : రసాయనిక ఎరువులకు బదులుగా జీవ ఎరువుల వినియోగంతో భూసారాన్ని రక్షించుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి విజయభాస్కర్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మండల వ్యవసాయాధికారి ఏఓ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ మృతిక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌భాస్కర్ హాజరై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సంచాలకులు రమేష్, కంపెనీ ప్రతినిధి సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వాజేడు : మండలంలోని ధర్మవరంలో గురువారం వ్యవసాయ శాఖ అధికారులు మృత్తిక నేల దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారులు రైతులతో సమావేశం నిర్వహించారు. భవిష్యత్తు తరాలకు సుస్థిరమైన, సారవంతమైన నేలలను అందించాలన్నారు. నేల సంరక్షణచర్యలను పాటించాలన్నారు. ప్రతీ ఒక్క రైతు మట్టి పరీక్షలు చేయించుకోవచ్చన్నారు.ఏఈవో హరీష్ రైతులు పాల్గొన్నారు



ధర్మవరంలో రైతులతో వ్యవసాయశాఖ అధికారులు

● మల్హర్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొయ్యూర్‌లో గురువారం ప్రపంచ మృతిక(నేల) దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి శ్రీజ మాట్లాడారు. నేల సారవంతంగా లేకపోతే ఎన్ని మందులు వాడిన ఫలితం శూన్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు పృథ్వీ, శిరీష, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్న కాళేశ్వరానికి పీఎంకేఎస్‌వై ద్వారా నిధులు

కాటారం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):కాటారం డివిజన్‌లోని నాలుగు మండలాల్లోని 45వేల ఎకరాలకు సాగునీరందించే కాళేశ్వర-ముక్తీశ్వర ఎత్తిపోతల పథకాని(చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్)కి పీఎంకేఎస్‌వై(ప్రధానమంత్రి కృషి సంచాయీ యోజన) ద్వారా కేంద్రం సాయం అందించనుందని అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం పంపిన ప్రతిపాదనలకు కేంద్రం పచ్చాజెండా ఊపడంతో చిన్న కాళేశ్వరానికి రూ.233కోట్ల నిధులు అందనున్నాయి. ప్రాజెక్టు డీపీఆర్(సవివర ప్రాజెక్టు నివేదిక)కు టీఏసీ(సాంకేతిక సలహా కమిటీ)తో పాటు సీడబ్ల్యూసీలోని పలు డైరెక్టరేట్లు ఆమోదం తెలిపాయని అధికారులు తెలిపారు. పీఎంకేఎస్‌వైలో భాగంగా ఆదివాసీ ప్రాంతాల్లోని ప్రాజెక్టులకు ఆయ్యే వ్యయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 90-10శాతం, ఇతర ప్రాంతాల్లో 60-40శాతం భరిస్తాయి. దీంతో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.233 కోట్ల నిధులు అందించే అవకాశం ఉంది.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏలకు ప్రత్యేక నిధుల ద్వారా ఇళ్లు కేటాయించడాన్ని పురస్కరించుకుని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. గురువారం ములుగులోని చౌరస్తాలో రవిచందర్ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి సీతక్క కృషి వల్ల సీఎం తీసుకున్న నిర్ణయం జిల్లా ప్రజల్లో ఆనందాన్ని నింపిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితం

గణపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితమవుతుంది తప్పా పనులు చేసిన పాపాన పోలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి అన్నారు. పార్టీ పిలుపు మేరకు గురువారం మండల కేంద్రంలో మండల కన్వీనర్ ఊర నవీన్‌రావు ఆధ్వర్యంలో ప్రారంభించగా వెన్నంపల్లి పాపన్న జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంగా చేసిన అభివృద్ధి శూన్యమని పేర్కొన్నారు. మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని వొుర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజమౌళి, రవి, మంద మహేష్, మొగిలి, రాజేందర్, గలీఫ్, నాగరాజు, భాస్కర్‌రావు, సమ్మిరెడ్డి, పున్నం చందర్ తదితరులు పాల్గొన్నారు.



గణపురంలో బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

అసత్య ప్రచారాలు చేపడితే సహించేది లేదు

ఏటూరునాగారం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత జాడి రామ్మడి అలియాస్ రామరాజు కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారాలు చేపడితే సహించేది లేదని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ మండల పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రఘు హాజరై మాట్లాడుతూ.. ఏటూరునాగారం బస్సు డిపో మంజూరు చేయాలని ధర్నా చేపట్టింది కాంగ్రెస్ పార్టీ అని, కష్టం ఒకరిదైతే పేరు మాది అన్ని బీజేపీ నాయకుడు రామరాజు చెపుకోవడం సరికాదన్నారు. మంత్రి సీతక్క ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఏటూరునాగారం బస్సు డిపో మంజూరు చేయాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్నఎల్లయ్య, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు సోదారి రామయ్య, మండల సోషల్ మీడియా కోర్డినేటర్ సోదారి హరీష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కవిరి మొండయ్య, రాములు పాల్గొన్నారు.

మెపా జిల్లా అధ్యక్షుడిగా కిషన్

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) ములుగు జిల్లా అధ్యక్షుడిగా ములుగుకు చెందిన అచ్చునూరి కిషన్ ఎన్నికయ్యారు. ఈమేరకు గురువారం హనుమకొండలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగగా మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ నాయకుల సమక్షంలో కిషన్‌ను ములుగు జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసి నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, ప్రధాన కార్యదర్శి బొట్లపల్లి సంజీవకుమార్, తదితరులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా ప్రజా విజయోత్సవ వేడుకలు

కాటారం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలో ప్రజా పాలన -ప్రజా విజయోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ గ్రిడ్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సమీపంలోని ఓవర్ హెడ్ ట్యాంక్‌లో, పలు జీపీల పరిధిలోని ఓహెచ్‌ఎస్‌ఆర్‌లను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ మాట్లాడారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు సమీర్‌ఖాన్, కర్ణాకర్, ఉమాదేవి, కృష్ణవేణి, శ్రీనివాస్, శంకర్, దేవేందర్, శేఖర్, గంగాధరన్, ప్రవీణ్, సునిత, శివ, సాయి, వంశీ, ప్రవీణ్, రాజశేఖర్, రాకేష్, సురేష్, ప్రసన్న ఉన్నారు.

క్రీడలతో యువతకు మంచి భవిష్యత్

ఏటూరునాగారం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో యువతకు మంచి భవిష్యత్ ఉందని ఏటూరునాగారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. ప్రజా పాలన, విజయోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల మైదనంలో సీఎం కప్ 2024 హ్యాండ్ బాల్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘు ముఖ్యఅతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోచ్ పర్వతాల కుమారస్వామి, అడ్వకేట్ వైద్యులు వెంకటేశ్వర్, కాంగ్రెస్ నాయకులు వావిలాల చిన్నఎల్లయ్య, సాంబశివరావు, ముక్కెర భిక్షపతి పాల్గొన్నారు.

విజయోత్సవ సభకు తరలిరావాలి

చిట్యాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 8న మండల కేంద్రంలో నిర్వహించతలపెట్టిన ప్రజా పాలన విజయోత్సవ సభకు మండలంలోని కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని మండల పార్టీ అధ్యక్షుడు గూట్ల తిరుపతి కోరారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తిరుపతి, చిట్యాల ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవీ సత్యనారాయణ మాట్లాడారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య, మండల ప్రధానకార్యదర్శి గడ్డం కొమురయ్య, చిలుకల రాయకొంరు, కామిడి రత్నాకర్‌రెడ్డి, నందరాజు, బుర్ర శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్, దబ్బెట అనీల్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లకొండ కుమార్, మేరుగు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీఎంఎఫ్ ఆధ్వర్యంలో గణిత ప్రతిభా పరీక్షలు

మంగపేట, డిసెంబరు, 5 (ఆంధ్రజ్యోతి): మంగపేట జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 10వతరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం మండలస్థాయి గణిత ప్రతిభా పరీక్ష టీఎంఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంఈవో పొదెం మేనక హాజరై ప్రశ్న పత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. విజేతలకు ఎంఈవో మేనక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమలాపురం జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం గడ్డి శ్రీనివాస్, టిఎంఎఫ్ ములుగు శాఖ ప్రధానకార్యదర్శి చందా భద్రయ్య, మంగపేట మండల కన్వీనర్ జె. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, పావని, ప్రవీణ. తిరుమల పాల్గొన్నారు.

● గోవిందరావుపేట, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో విద్యార్థులకు తెలంగాణ గణిత ఫోరం(టీఎంఎఫ్) ఆధ్వర్యంలో మండలస్థాయి గణిత ప్రతిభా పరీక్షలు గురువారం జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంఈవో గొంది దివాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించారు. ఈపోటీల్లో ప్రథమస్థానంలో డి.కారుణ్య, చరణ్‌తేజ్, ఎ.దీప్రా, వి.అక్షయ, ఎం.ఉదయ్‌కుమార్‌లు నిలిచారు. ఈ కార్యక్రమంలో గణితఫోరం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.చంద్రారెడ్డి, రాయప్ప, ఉపాధ్యాయులు సమ్మేశ్వర్‌రావు, అన్నామేరీ, సరిత, అనిత పాల్గొన్నారు.

● తాడ్వాయి, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఇందిరానగర్ జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో తెలంగాణ గణిత ఫోరం(టీఎంఎఫ్) ఆధ్వర్యంలో విద్యార్థులకు మండలస్థాయి గణిత ప్రతిభా పరీక్షలు గురువారం జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎంఈవో రేగ కేశవరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రశ్న పత్రాన్ని ఆవిష్కరించారు. పోటీల్లో ప్రథమస్థానంలో జి.నాగ చైతన్య(ఇందిరానగర్ జడ్పీహెచ్‌ఎస్), ఎమ్డీ.హర్షిన్(కాటాపూర్), జె.అస్మిత(మేడారం టీడబ్ల్యూఏహెచ్‌ఎస్), ద్వితీయస్థానంలో డి.రోహిణి (బీరెల్లి జడ్పీహెచ్‌ఎస్), ఎస్కే.నిజాముద్దీన్(కాటాపూర్)లకు బహుమతులు అందజేశారు.

● వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు తెలంగాణ గణిత ఫోరం(టీఎంఎఫ్) ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్షలు గురువారం జరిగాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు ఏళ్ల మధుసూదన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గణితఫోరం జిల్లా కార్యవర్గ సభ్యుడు జనగాం బాబూరావు, మండల అధ్యక్షులు శ్రీనివాస్, శారద తదితరులు పాల్గొన్నారు.



మంగపేటలో ప్రశ్న పత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈవో నిర్వాహకులు